ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 22.0

నేడు మహాశివరాత్రి







శివరాత్రి సందర్భంగా పుష్పాలంకరణలో భీమవరం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయం.. నందివాహనంపై జుత్తిగ ఉమా వాసుకి రవి సోమేశ్వర స్వామి గ్రామోత్సవం.. విద్యుద్దీప కాంతులతో పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం



పవన్‌తో భేటీ అయిన అంజిబాబు, చినబాబు, సూరి

జనసేనలోకి అంజిబాబు

- పవన్‌తో భేటీ.. భీమవరం నుంచి పోటీ
- మూడు నియోజకవర్గాల్లో ఐవీఆర్ సర్వే

భీమవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భీమవరం నుంచి మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పోటీ చేసేందుకు లైన్ క్లియర్ అవుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), మాజీ ఎమ్మెల్యే అంజిబాబు, వేగేశ్న కనక రాజుసూరి తదితరులు ఉన్నారు. భీమవరం నుంచి పోటీ చేయాలని నాయకులు పవన్‌ను కోరగా ఉమ్మడి అభ్యర్థిగా ఎవరినైనా నెగ్గించాల్సిన బాధ్యత కేడర్ తీసుకోవాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. అంజిబాబుకు సహకరించాలన్నారు. మంచిరోజు చూసుకుని జనసేనలో చేరతానని అంజిబాబు పవన్‌కు తెలిపారు. మరోవైపు పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెంకు తన పేరును ఖరారు చేశారన్న సమాచారం అందుకున్న బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం పవన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పవన్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని శ్రీనివాస్ తెలిపారు. నాదెండ్ల మనోహర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కూటమితో కలిసి మెలిసి వెళ్లి విజయం సాధించేలా కృషి చేయాలని పవన్ సూచించారు.

ఐవీఆర్ సర్వే

జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఐవీఆర్ సర్వే నిర్వహించింది. భీమవరంలో అంజిబాబు పేరు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో బొలిశెట్టి శ్రీనివాస్, నరసాపురంలో జనసేన ఇన్‌చార్జ్ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పేర్లతో ఈ సర్వే చేపట్టింది.



మనోహర్‌ను కలిసిన బొలిశెట్టి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

గెలుపు ధర్మమూ పాటించాలి

- టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని

భీమడోలు, మార్చి 7 : పొత్తు ధర్మంతోపాటు గెలుపు ధర్మం పాటించాలని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పార్టీ కార్యకర్తలకు సూచించారు. పొత్తులో భాగంగా ఉంగుటూరు అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించినట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి పార్టీ క్యాడర్ తీవ్ర అసహనానికి లోనై గన్ని క్యాంపు కార్యాలయానికి తరలి వచ్చింది. ఈ సందర్భంగా కార్యకర్తలు ఉద్రేకానికి లోనయ్యారు. వారిని వారిస్తూ మధ్యాహ్నం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్టు గన్ని ప్రకటించారు. గన్నికి న్యాయం చేయకపోతే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని సమావేశంలో సీనియర్ నాయకులు హెచ్చరించారు. టీడీపీ జిల్లా యువజన నాయకుడు రెడ్డి చందు తన పదవి రాజీనామా చేస్తానని ప్రకటించారు. అధిష్ఠానం పునరాలోచన చేయాలన్నారు. ఉన్నమట్ల సునీత, ఇందుకూరి రామకృష్ణంరాజు, కృష్ణమోహన్, ముత్యాలస్వామి, కొండబాబు, ఆశీర్వాదం తదితరులు గన్నికి మద్దతుగా మాట్లాడారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ.. 'పార్టీ క్యాడర్, కార్యకర్తలు సంయమనం పాటించాలి. రాజీనామాలు వద్దు. నియోజకవర్గ పరిస్థితిని అధిష్ఠానం దృష్టిలో పెడదాం. జనసేనను కాని, ఆ నేతలను విమర్శించవద్దు. శనివారం మళ్లీ నియోజకవర్గ నాయకులతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్దాం' అని వివరించారు. సమావేశానికి ఉంగుటూరు, భీమడోలు, గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన వేలాది మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పొత్తు సీట్లు ఫైనల్‌కు..!

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

టీడీపీ-జనసేనకు బీజేపీ జత !

- ఒకట్రెండు రోజుల్లోనే తుది జాబితా
- సీట్ల కేటాయింపుపై పూర్తి స్పష్టత
- జనసేనాని పోటీపైనా స్పష్టత
- టీడీపీలో త్యాగాల నైరాశ్యం

టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తులు, సీట్ల కేటాయింపు క్లైమాక్స్‌కు చేరుకుంది. ఒకటి, రెండు రోజుల్లో తుది జాబితాపై పూర్తి స్పష్టత వచ్చి సీట్ల కేటాయింపు జరగనుంది. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు ఏడు సీట్లకు మాత్రమే టీడీపీ అధికారికంగా అభ్యర్థులను ప్రకటించింది. ఏలూరు జిల్లాలో ఏలూరు, చింతలపూడి, నూజివీడుల్లో అభ్యర్థులను రంగంలోకి దింపడంతో వారంతా నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. దెందులూరు, ఉంగుటూరు, కైకలూరు, పోలవరం నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి వుంది. ఇప్పటికే టీడీపీ-జనసేన మధ్య సీట్ల సర్దుబాటు కుదిరినప్పటికీ, బీజేపీ కలిసి వస్తే ఆ దిశగా సమన్వయానికి వీలుగా జనసేన తన అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పూర్తి సస్పెన్స్ కొనసాగుతోంది. దెందులూరులో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ప్రకటించాల్సి వున్నా, రెండో జాబితాలో చోటు కోసం వెయిటింగ్‌లో వున్నారు. ఇదే అదనుగా అనేక ప్రచారాలు చిలువలు పలవలుగా మారాయి. ఈ మధ్యనే ప్రభాకర్ తన నియోజకవర్గానికి సంబంధించి కేడర్ అంతటికీ ఒక క్లారిటీ ఇచ్చారు. అపోహలకు తావు లేదని, సోషల్ మీడియా వార్తలు నమ్మవద్దని, తానే పోటీకి సిద్ధంగా వున్నానని తేల్చి చెప్పారు. అయినా, ప్రచారం ఆగక పోగా రకరకాల పేర్లతో కొందరు ఊదరగొడుతూనే వున్నారు. వీటికి ఒకటి రెండు రోజుల్లో చెక్ పెట్టబోతున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనే యులు తటస్థ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆయన ఉంగుటూరు నుంచి వరుసగా పోటీ చేస్తూ వస్తున్నారు. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు జనసేన తహతహలాడుతోంది. దీనికి అనుగుణంగానే ప్రచార పరంపర సాగుతోంది. నియోజకవర్గంలో బలమైన పునాది వేసుకున్న గన్నికి ఎలాంటి అవరోధాలు సృష్టించవద్దని, పొత్తు ధర్మంతోపాటు గెలుపు ధర్మాన్ని పాటించాలంటూ గన్నితో పాటు ఆయన కేడర్ గురువారం గళమెత్తారు. మరోవైపు జన సేన పక్షాన పచ్చమట్ల ధర్మరాజు వర్గం ఉంగుటూరు సీటు తమకేనని ధీమాతో ఉన్నారు. ఆయన అనుచరులంతా తాజా గా సంబరాలు చేసుకున్నారు. పోలవరంలోనూ ఈ తరహా లోనే ఇరు పార్టీల కేడర్ నలిగిపోయింది. పోలవరం ఎవరికి కేటాయించబోతున్నారో తెలియక తికమకపడుతూ వచ్చారు. జనసేన ఆది నుంచి ఈ స్థానాన్ని ఆశిస్తూ వచ్చింది. కానీ అప్పటికే టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ ఐదేళ్లుగా చెమటోడ్చారు. ఆర్థిక ఇబ్బందులను లెక్క చేయకుండా ముందుకు సాగారు. ఈ స్థానం నుంచి జనసేన పక్షాన చిర్రి బాలరాజు గత ఎన్నికల్లోను పోటీ చేశారు. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో జనసేన నాయకత్వం ఉమ్మడి కోటాలో పోటీకి సిద్ధంగా ప్రతిపాదించింది. ఇప్పటి వరకు పోలవరం నుంచి అభ్యర్థులు ఎవరినీ ప్రకటించకపోయినా, రెండో జాబితాలో క్లారిటీ ఇవ్వబోతున్నారు.

కైకలూరు నుంచి తెలుగుదేశం ఇప్పటి వరకు అభ్యర్థి వైపు దృష్టి పెట్టలేదు. బీజేపీతో పొత్తు కుదుర్చుకుంటే అక్కడి నుంచి సీనియర్ నేత, మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌కు అనుకూలంగానే రిజర్వ్ పాటించారు. పొత్తు ఖాయమనే భావంతో డాక్టర్ శ్రీనివాస్ ఆత్మీయ కలయిక పేరిట అందరితో మమేకం అవుతున్నారు. ఏలూరు జిల్లాలో ప్రకటించాల్సిన నాలుగు స్థానాల్లో ఒకటి తెలుగుదేశం, రెండు జనసేన, ఒకటి బీజేపీకి పొత్తులో భాగంగా కేటాయించే అవకాశాలు వున్నాయని అంచనా వేశారు. ఏలూరు లోక్‌సభ స్థానానికి సంబంధించి టీడీపీ పక్షాన గోరుముచ్చు గోపాల్‌యాదవ్, భాష్యం రామకృష్ణ, డాక్టర్ పవన్, కంభంపాటి రామ్మోహన్ పేర్లు విస్తృతంగా వినిపించాయి. పొత్తు తమకే అనుకూలంగా ఉంటుందని, తమ అభ్యర్థి గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) వుంటారని బీజేపీ వర్గాలు మూడు నెలల నుంచి వాదిస్తూనే వున్నాయి. ఇప్పుడు పొత్తు ఒక కొలిక్కి వస్తున్నందున రోజుల వ్యవధిలోనే ఈ సస్పెన్స్ వీడబోతోంది.



నరసాపురంలో నవరసాలు

నరసాపురం లోక్‌సభా స్థానంతోపాటు ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైసీపీకి వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీంతో వైసీపీ రకరకాల ప్రయోగాలు చేస్తూ వస్తోంది. బీసీ మంత్రం తెర ముందుకు తెచ్చింది. ఇప్పటికే ఉండి నుంచి మంతెన రామరాజు, పాలకొల్లు నుంచి నిమ్మల రామానాయుడు, ఆచంట నుంచి పితాని సత్యనారాయణ, తణుకు నుంచి ఆరిమిల్లి రాధాకృష్ణ అభ్యర్థిత్వాలను టీడీపీ ప్రకటించింది. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో ఎడతెగని సస్పెన్స్ కొనసాగుతూ వచ్చింది. భీమవరం నుంచి జనసేనాధిపతి పవన్ కల్యాణ్ పోటీ చేస్తారని కొన్నాళ్లు ప్రచారం సాగింది. కానీ పవన్ భీమవరంతో పాటు పిఠాపురంలోను పోటీ చేస్తారనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇవి రెండూ కాక, పవన్ వీలైతే పార్లమెంట్‌కు పోటీ చేస్తారంటూ మరో ప్రచారం ఆరంభమైంది. దీనిపై కూడా జనసేన ఒకటి రెండు రోజుల్లోనే అభ్యర్థులను ప్రకటించి క్లారిటీ ఇవ్వబోతోంది. తాడేపల్లిగూడెంలో టీడీపీ జనసేన నేతలు నువ్వా నేనా అన్నట్టు పోటీలు పడుతున్నారు. టీడీపీ పక్షాన వలవల బాబ్జీ ఇప్పటికే సర్వం ధారబోసి పార్టీకి అండగా నిలబడి పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా నడిపించగలిగారు. టీడీపీ అధినాయకత్వం బాబ్జీ సేవలను గుర్తించింది. అయినా జనసేన ఈ సీటుపై పూర్తిస్థాయి దృష్టి పెట్టింది. జనసేన పక్షాన బొలిశెట్టి శ్రీనివాస్ పోటీకి తహతహలాడుతున్నారు. జనసేన నాయకత్వం తుది నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. నరసాపురం నియోజక వర్గంలో టీడీపీ ఎప్పుడో ఆశలు వదులుకుంది. ఈ స్థానం నుంచి జనసేన పక్షాన బొమ్మిడి నాయకర్ పేరు తెరముందుకు వచ్చింది. మత్స్యకార కుటుంబానికి చెందిన నాయకర్ గత ఎన్నికల్లోనూ సంతృప్తికరస్థాయిలో ఓట్లు సాధించారు. ఈ నియోజకవర్గంలో తాజాగా సీనియర్ నేత కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనలో చేరారు. ఇపుడు సీటు ఎవరికి కేటాయిస్తారనేది త్వరలోనే తేలిపోనుంది. నాయకర్ పోటీకి వీలుగా జనసేన ప్రకటన చేయబోతోందని చెబుతు న్నారు. నరసాపురం లోక్‌సభా స్థానానికి రఘురామకృష్ణంరాజు పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన ఈ మధ్యనే వైసీపీకి రాజీనామా చేసినా మరే పార్టీలోనూ చేరలేదు. బీజేపీతో ఎన్నికల పొత్తు కుదిరిన తర్వాత ఒక నిర్ణయం తీసుకుని రంగంలోకి దిగుతారని కొంతమంది భావిస్తున్నారు. రఘురాం కూడా నరసాపురం నుంచే రెండోసారి పోటీకి సిద్ధమయ్యారు. మరోవైపు రఘురామను ఢీకొనాలని వైసీపీ ఇప్పటికే పక్కా ప్రణాళికతో వుంది. తన అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను ప్రకటించినా, చివరి క్షణంలో మార్పులు చేర్పులు ఉంటాయా.. ఉండవా.. అన్నది ఆ పార్టీలో చర్చగా మారింది. రఘురామకు దీటుగా దివంగత రెబెల్ స్టార్ కృష్ణంరాజు సతీమణిని రంగంలోకి దింపుతారంటూ సోషల్ మీడియాలో ఇప్పటికే ఊదరగొట్టారు.

సీటు ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేయాలి : మాజీ ఎంపీ మాగంటి

కైకలూరు, మార్చి 7 : వచ్చే ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా సీటు ఎవరికి ఇచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి, చంద్రబాబును సీఎం చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) స్పష్టం చేశారు. గురువారం కైకలూరులో పార్టీ మండల సమావేశం జరిగింది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో భాగంగా బీజేపీతో పొత్తు చాలా అవసరం. టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుండడంతో రాష్ట్రాభివృద్ధి చెందాలంటే బీజేపీ సహకారం ఉండాలన్నారు. వైసీపీ నాయకుల ఉడత బెదిరింపులకు ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పుడు రెచ్చిపోయిన వారికి గుణపాఠం చెబుతామన్నారు. బాబు కుమారుడు రాంజీ మూడో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నాయకులు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, కొడాలి వినోద్, పెన్మెత్స త్రినాధరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, నున్న రమాదేవి, వల్లభనేని శ్రీనివాసచౌదరి, తాడినాడ బాబు, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, బలే ఏసురాజు, పూల రామచంద్రరావు, అంద్రాజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక దోచేస్తున్నారు..!

- పెదరావిగూడెంలో గోదావరి ఒడ్డును తవ్వి ర్యాంపు .. ఇబ్రహీంపేటలో యంత్రాలతో తవ్వకాలు.. యథేచ్ఛగా ఇసుక తరలింపు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కుక్కునూరు, మార్చి 7 : ఏజెన్సీ ప్రాంతం అడిగే వారు లేరు.. చూసేవారు లేరు.. పట్టించుకునేవారు లేరు.. ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. గోదావరి ఒడ్డునే అక్రమంగా తవ్వి ర్యాంపు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో గోదావరిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన వ్యవస్థ ముడుపుల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కుక్కునూరు మండలం పెదరావిగూడెం, ఇబ్రహీంపేట, బూరుగువాయి ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. కుక్కునూరు మండల కేంద్రానికి దాదాపుగా 30 నుంచి 35 కి.మీ దూరంలో మారుమూల ప్రాంతాలు కావడం అక్రమార్కులకు కలసి వచ్చింది. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు ఇసుక రవాణా తాత్కాలికంగా నిలిపివేయడం. ఆ తర్వాత మళ్ళీ రాత్రి సమయాల్లో కొనసాగించడం పరిపాటిగా మారింది. రాత్రుళ్లు నిఘా అంతంత మాత్రంగా ఉండడంతో ఆంధ్రా-తెలంగాణలోని సరిహద్దుల నుంచి ఇసుక తరలిపోతోంది. అక్రమార్కులు స్థానికంగా కూడా ఇసుక అక్రమంగా అమ్మకాలు చేస్తూ లక్షలు గడిస్తున్నారు. పెదరావిగూడెంలో గోదావరి ఒడ్డును తవ్వి గ్రావెల్ రహదారి వేసి వాహనాలు గోదావరిలోకి వెళ్లేలా మార్గం ఏర్పాటు చేశారు. ఇసుకను యంత్రాలతో తవ్వి వాహనాల్లో లోడ్ చేసుకొని తరలిస్తున్నారు. ఈ ర్యాంపు చుట్టుపక్కల నాలుగు గ్రామాల్లో వందలాది జమాయిల్ నర్సరీలు ఉన్నాయి. నర్సరీల్లో ఇసుక అవసరాలకి, ఇతరత్ర అవసరాలకి ఈ ర్యాంపు నుంచే అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.2500 నుంచి రూ.3000 వరకు తీసుకుంటున్నట్టు సమాచారం. పలు శాఖల అధికారులతో సన్నిహితంగా ఉండే కొందరు రాజకీయ నాయకులే సూత్రధారులనే ఆరోపణలు వస్తున్నాయి.

ఇబ్రహీంపేట ఇసుక ర్యాంపుని పరిశీలిస్తే కళ్లు బైర్లు కమ్మతాయి. కేజీఎఫ్ సినిమాను తలపించేలా గోదావరిలో ఇసుక తవ్వేస్తున్నారు. గోదావరిలో సగభాగం వరకు ఇసుక యంత్రాలతో తవ్వేశారు. ఇటీవల ఈ ర్యాంపుని నిలుపుదల చేసినట్టు రెవెన్యూశాఖ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రాత్రి సమయంలో ఇసుక తరలివెళుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం అధికారికంగా ఇబ్రహీంపేట ఇసుక ర్యాంపు మంజూరు చేసింది. పీసా చట్టం ప్రకారం గోదావరిలో ఇసుకను మనుష్యుల ద్వారా తవ్వకాలు జరిపి ఇసుకను తరలించి ఒక స్టాక్ పాయింట్‌లో నిల్వ చేయాలి. అనంతరం ప్రభుత్వం టెండర్ ద్వారా కేటాయించిన సంస్థ ద్వారా ఇసుక అమ్మకాలు జరపాలి. కానీ ఇందుకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుకను తవ్వి నిల్వ చేశారు. ఇక్కడ తవ్విన ఇసుకను పునరావాసం ఇళ్లకు, హౌసింగ్ ఇళ్లకు, ప్రభుత్వ పనులకు, ప్రజలకు అవసరాలకు మాత్రమే అమ్మకాలు జరపాలి. కానీ ప్రస్తుతం అక్కడ నిల్వలు చూస్తే లక్షలాది యూనిట్ల ఇసుక ఉంది. కోట్ల విలువ చేసే ఇసుక నిల్వ ఉన్నా పూర్తి స్థాయిలో నిఘా లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇబ్రహీంపేట ర్యాంపులో ఇసుక అక్రమంగా తవ్వకాలు చేస్తున్న క్రమంలో ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్టు తహసీల్దార్ అచ్యుత కుమారి చెబుతున్నారు. ఫిబ్రవరి 16న కుక్కునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దాదాపు 20 రోజులైనా ఇంతవరకు కుక్కునూరు పోలీస్ స్టేషన్‌కు యంత్రాన్ని తరలించలేదు. ఇంకా కాంట్రాక్టర్‌కు చెందిన ప్రాంతంలోనే ఉంచారు. గోదావరి ఒడ్డుని తవ్వి అక్రమంగా ర్యాంపు ఏర్పాటు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





పెదరావిగూడెంలో గోదావరి ఒడ్డును తవ్వేసి ర్యాంపు.. ఇసుక తవ్వకాలు



ఇబ్రహీం పేటలో యంత్రాలతో భారీగా ఇసుక తవ్వకాలు

ఇంటర్ పరీక్షలకు 14,242 మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 7 : ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం/వృక్షశాస్త్రం/పౌరశాస్త్రం పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని డీఈఐవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ విభాగంలో 12,509 మంది విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో 1,733 మంది హాజరుకాగా, మొత్తం 570 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.



ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన అభ్యర్థులు

దగా డీఎస్సీ మాకొద్దు.. గిరిజన డీఎస్సీ కావాలి..

- ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజన అభ్యర్థుల ధర్నా

బుట్టాయగూడెం, మార్చి 7 : దగా డీఎస్సీ మాకొద్దు.. గిరిజన డీఎస్సీ కావాలంటూ గురువారం కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో డీఎస్సీ గిరిజన అభ్యర్థులు ధర్నా, ఆందోళన చేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్మల రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 6100 డీఎస్సీ టీచర్ పోస్టుల్లో 1025 గిరిజన సంక్షేమ శాఖకు కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఐటీడీఏల పరిధిలో 517 నోటిఫై చేశారన్నారు. ఇందులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 14 పోస్టులు మాత్రమే కేటాయించారని, దీనివల్ల ఆదివాసీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఖాళీ పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు-3 ప్రకారం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అన్ని పోస్టులు గిరిజనులకు కాకుండా ఇతరులతో భర్తీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీ ప్రాంతం, పాఠశాలలు, నిధులు ఆదివాసీలవే అయినప్పుడు ఉద్యోగాలు ఇతరులకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, మాతృభాషా విద్యా వలంటీర్లను రెన్యూవల్ చేయాలని కోరారు. ప్రత్యేక డీఎస్సీ కోసం ఈనెల 10న జరిగే మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుంజా నవీన్‌కుమార్, పోలోజు నాగేశ్వరావు, బొరగం భూచంద్రం, చంద్రా బుల్లెమ్మ, తామా బాలరాజు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బీఎడ్‌లకు 204.. డీఎడ్‌లకు 102



ఇక ఎవరి పోస్టులు వారికే!

- బీఎడ్ అభ్యర్థులకు రెట్టింపు పోటీ
- ఎస్జీటీ ఉద్యోగార్థుల్లో ఉత్సాహం
- అమలు సాధ్యం కాని ప్రకటనలతో ఆశలను వమ్ము చేశారంటూ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల నిరుత్సాహం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 7 : మెగా డీఎస్సీ స్థానే కేవలం 306 పోస్టులతో దగా డీఎస్సీ నోటిఫికేషన్. తీరా చూస్తే ఇప్పుడు డీఎస్సీ దరఖాస్తుదారుల ఆశలు మరోసారి గల్లంతు. తొలుత నోటిఫికేషన్‌లో సెకండరీగ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు బీఎడ్ అభ్యర్థులు అర్హులేననడంతో ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు గంపెడాశలతో దరఖాస్తు చేసుకోగా ఇప్పుడు ఎస్జీటీ పోస్టులకు కేవలం డీఎడ్/డీఎల్‌ఎడ్ విద్యార్హతలుగల అభ్యర్థులే అర్హులంటూ ప్రభుత్వం స్పష్టంచేయడంతో నిరుత్సాహం నెలకొంది. వాస్తవానికి ఎస్జీటీ పోస్టులు డీఎడ్/డీఎల్‌ఎడ్ అభ్యర్థులకు మాత్రమే పరిమితమంటూ జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) మార్గదర్శకాలు, సుప్రీంకోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, వాటిని అనుసరించకుండా రాష్ట్రప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగ నియామకాలపై బిల్డప్ కోసమే అమలు సాధ్యం కాదని తెలిసిమరీ ఎస్జీటీ ఉద్యోగాలకు బీఎడ్ అభ్యర్థులూ అర్హులేనంటూ ప్రచార ఆర్భాటం చేసిందంటూ దరఖాస్తుదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఆ మేరకు గురువారం జారీచేసిన మార్గదర్శకాల్లో ఎస్జీటీ పోస్టులకు డీఎడ్/డీఎల్‌ఎడ్ అభ్యర్థులే అర్హులని స్పష్టతనివ్వడంతో ఇప్పటికే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న బీఎడ్ అభ్యర్థుల్లో నిరుత్సాహం నెలకొంది.

ఇక బీఎడ్ అభ్యర్థులకు 204 పోస్టులే..

డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో ఉమ్మడి జిల్లాలో మొత్తం 306 ఉపాధ్యాయ ఉద్యోగాలను నోటిఫై చేసిన విషయం విదితమే. వీటిలో ఎస్జీటీ కేడర్ 102 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్/టీజీటీ కేడర్ పోస్టులు 204 ఉన్నాయి. నోటిఫై చేసిన ఎస్జీటీ ఉద్యోగాల్లో 88 పోస్టులు జిల్లాలోని వివిధ మున్సిపాల్టీల్లోను, మిగతా 14 గిరిజన పాఠశాలల్లోను భర్తీ చేయడానికి ఉద్దేశించారు. తాజా పరిణామాల నేపథ్యంలో బీఎడ్ విద్యార్హతలతో కేవలం ఎస్జీటీ కేడర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డీఎస్సీ దరఖాస్తు నిమిత్తం చెల్లించిన రుసుంను వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తారని తెలిసింది. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రెండింటికీ దరఖాస్తు చేసుకున్న బీఎడ్ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగ నియామకపోటీకి కొనసాగవచ్చని విద్యాశాఖ కార్యాలయ వర్గాలు వివరించాయి. ఎస్జీటీ పోస్టులకు డీఎడ్/డీఎల్‌ఎడ్ అభ్యర్థులను మాత్రమే అర్హులుగా చేయడంతో ఈ విభాగంలో ఉద్యోగార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంటుందని, ఆ మేరకు పోటీ కూడా పరిమితంగానే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే బీఎడ్ అభ్యర్థులకు ప్రత్యేకించిన 204 స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టులకు జిల్లాలో విపరీతమైన పోటీ తప్పదని భావిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో కేడర్ వారీగా డీఎస్సీ-2024కి అందిన దరఖాస్తుల సంఖ్య అధికారికంగా ఇంకా వెల్లడికాలేదు. మరోవైపు డీఎస్సీ పరీక్షల తేదీలను రీషెడ్యూల్ చేయాలంటూ హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ప్రకటన విడుదల చేయకపోవడంపై అభ్యర్థుల్లో డైలమా నెలకొంది.



కొవ్వలి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న బృందం

కొవ్వలి స్కూల్‌ను పరిశీలించిన ఉత్తరాఖండ్ బృందం

దెందులూరు, మార్చి7 : ఉత్తరాఖండ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ జాయింట్ డైరెక్టర్ల బృందం గురువారం దెందులూరు మండలం కొవ్వలి హైస్కూల్‌ను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం శర్మను బృంద సభ్యులు ఆశారాణీ, పుష్పలత వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, ల్యాబ్, గ్రంథాలయం, మధ్యాహ్నభోజనం, విద్యాబోధనతో పాటు పలు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 7 : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ)లుగా పనిచేస్తున్నవారిలో నిర్దిత అర్హతలు గలవారికి స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ (విభిన్న ప్రతిభావంతుల కోర్సు) ఉపాధ్యాయులుగా పదోన్నతి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత అర్హతలు గల టీచర్లు తమ విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు, సేవాపుస్తకంతో ఈనెల 8న సాయంత్రం 4 గంటల్లోగా ఏలూరు డీఈవో కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో పదోన్నతిపై వీటిని భర్తీ చేయడానికి 8 పోస్టులున్నాయి.దరఖాస్తులను స్వీక రించడానికి శుక్రవారం సెలవు దినమైనప్పటికీ డీఈవో కార్యాలయంలో సంబంధిత విభాగం పనిచేస్తుందని అధికారవర్గాలు వివరించాయి.

కోర్టు విధుల బహిష్కరణ విరమణ

ఏలూరు క్రైం, మార్చి 7 : హైకోర్టు సూచనల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఫెడరేషన్ న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ కార్యక్రమాన్ని విరమిస్తున్నట్లు బార్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అబ్బినేని విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక లేఖను ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ కార్యదర్శికి పంపించారు. ఏపీ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని ఆ యాక్టు వల్ల సన్న, చిన్న, రైతులకు పేద ప్రజలకు తీరని నష్టం వాటిల్లేలా ఉందని దానిని వెంటనే రద్దు చేయాలని కొద్ది నెలలుగా న్యాయవాదులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ నెల 15వ తేదీ వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. హైకోర్టు సూచనల మేరకు కోర్టు విధులకు హాజరవుతున్నామని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్..పాల్గొన్న సిబ్బంది

క్యాన్సర్‌పై ఆత్మస్థైర్యం కల్పించాలి

ఏలూరు క్రైం, మార్చి 7 : క్యాన్సర్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్గి ఉండి రోగులకు ఆత్మసైర్యం కల్పించాలని ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. కళాశాలలో కమ్యూనిటీ మెడిసన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ అంటే ఏదో తెలియని భయం ప్రజల్లో ఉందని ఈ వ్యాధి వస్తే లైఫ్‌టైమ్ తగ్గిపోతుందని అభిప్రాయం ఉందని ఈ వ్యాధిని నిర్మూలించడానికి మూడు దశల్లో ఆధునిక వైద్య విజ్ఞాన పరిజ్ఞానం అందుబాటులో ఉన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆగ్నెస్ విజయ, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ గంగా భవానీ, డిపార్టుమెంట్ హెచ్‌వోడీలు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రభుత్వా సుపత్రి మహిళా సిబ్బంది, మొదటి సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతపై మాక్ డ్రిల్



తణుకు, మార్చి7: పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్‌లో కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రాకెట్ ఇంధన పరిశ్రమలో ఉపయోగించే బుటాడైన్ అనే ముడి పదార్థం అనుకోని పరిస్థితుల్లోలీకై ప్రమాదం సంభవించినపుడు తీసు కోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ ద్వారా ప్రదర్శించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు, మున్సిపల్ కమిషనర్ బి.వి.రమణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు, జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భానునాయక్, ఆంధ్రా షుగర్స్ యాజమాన్యం తరపున ఫ్యాక్టరీ మేనేజర్ పాతూరి విశ్వనాథకుమార్, జీఎం అడుసుమల్లి సాంబశివరావు, జి.రంగారావు, వేగి రాజేంద్రప్రసాదు పాల్గొన్నారు.

సుందరగిరిపై నేడు మహా సుదర్శన నృశింహ యజ్ఞం




సాలిగ్రామాలకు పూజలు

ద్వారకాతిరుమల, మార్చి7: సుంద రగిరిపై కొలువైన శ్రీలక్ష్మీ నరసిం హుని ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్ర వారం నిర్వహించనున్న శ్రీమహా సుదర్శన నృశింహయజ్ఞానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఏటా మహా శివరాత్రి నాడు సాయంత్రం మొదలు తెల్లవార్లూ ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తారు. గురువారం ఉదయం గణపతి హోమాన్ని నరసింహ గురూజీ శాస్త్రోక్తంగా జరిపారు. రుత్వికులు శాలిగ్రామాలకు అభిషేకం చేశారు. ప్రధాన యజ్ఞకుండాన్ని సుందరీకరిస్తున్నారు.పలు వనమూలికలు, భక్ష్యాలు, వివిధ రకాల ద్రవ్యాలు, 9 రకాల సమిదులు, ద్రవ్యాలతో శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్న ఈ యజ్ఞక్రతువు భక్తులకు నేత్రపర్వం కానుంది.



ఇసుక బస్తాలతో బాట ఏర్పాటు



గోదావరి దాటడానికి వేసిన పంట్ల వంతెనపై విద్యుత్ దీపాలంకరణ

హర..హర మహాదేవ

నేడు మహా శివరాత్రి .. ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో ఏర్పాట్లు

ఏలూరు సిటీ, మార్చి 7: మహా శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం కావడంతో ప్రశిద్ధ శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో పోలవరం మండలం పట్టిసీమ వీరేశ్వరస్వామి ఆలయం, పెదవేగి సమీపంలోని బలివే రామలింగేశ్వర స్వామి, ఆచంట రామేశ్వరస్వామి, పంచారామ క్షేత్రాల్లో వేలాది మంది భక్తులు సందర్శించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆ క్షేత్రాల్లో ఏర్పాట్లు చేసినట్టు ఏలూరు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావు గురువారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి 4 గంటల వరకు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు, 4 గంటల నుంచి శుక్రవారం రాత్రి ఒంటిగంట వరకు భక్తులు దర్శనం చేసుకోవచ్చున్నారు. బలివే రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని, కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. పెదవేగి సమీపంలోని బలివే పుణ్యక్షేత్రానికి ఏలూరు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

పట్టిసీమ ముస్తాబు..

పోలవరం : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. జంగారెడ్డిగూడెం నుంచి పట్టిసీమ వచ్చే భక్తుల కోసం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద ఆర్టీసి కంట్రోల్ రూం, కొవ్వూరు వైపు నుంచి వచ్చే బస్సుల కోసం పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద ఆర్టీసీ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కొవ్వూరు వైపు నుంచి పట్టిసీమ చేరుకునే బస్సులు పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద నిలిపి అక్కడి నుంచి భక్తులను కన్నాపురం అడ్డరోడ్డుకి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెర్రీ రేవు ద్వారా పంపే విధంగా, జంగారెడ్డిగూడెం నుంచి వచ్చే బస్సులను కన్నాపురం అడ్డరోడ్డు వద్ద నిలిపి భక్తులను పంపడానికి ఏర్పాట్లు చేశారు. నదిపై భక్తులు కాలినడకన వెళ్లే వంతెనపై ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా అడుగడుగునా పోలీసు బందోబస్తు, ఈతగాళ్ళను, బోట్లు అందుబాటులో ఉంచారు. భక్తులు స్నానాలు చేసే నదీ ప్రాంతాల్లో వెదురు కర్రలతో బారికేడింగ్ ఏర్పాటు చేశారు. స్త్రీలు బట్టలు మార్చుకునే తాత్కాలిక మరుగుదొడ్లు, ఇసుక తిన్నెల్లో నడిచేందుకు వీలుగా సంచుల్లో ఇసుక నింపి కాలిబాట ఏర్పాటు చేశారు.ఉచిత దర్శనం 20, 50, 100,300 దర్శనాల టికెట్ల కౌంటర్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం, ఆలయ గోపురాలు విద్యుద్దీలతో ముస్తాబు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా రెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య, డీఎస్పీ సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బలివేలో సర్వం సిద్ధం

ముసునూరు: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఉత్సవాలకు సూమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశామని, సర్వ దర్శనానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. రూ.25, రూ100, రూ.200 టికెట్‌లతో ప్రత్యేక దర్శనం కూడా ఉందన్నారు. వృద్దులకు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు మంచినీరుతో పాటు మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు అందించనున్నట్లు తెలిపారు. భక్తుల పుణ్యస్నానాలకు ఇప్పటికే స్వామివారి ఆలయం చెంతకు తమ్మిలేరు జలాలు వచ్చాయని, పంచాయతీ ఆధ్వర్యంలో ఐదు మోటార్లతో జల్లుల స్నానాలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్ ఉన్నంతవరకు చలువ పందిళ్ళు వేశామన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 350 మందితో పోలీస్‌లతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య తెలిపారు.





బలివేలో స్వామివారి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు.. ఆలయం చెంతకు చేరిన తమ్మిలేరు జలాలు



వేడుకగా ఆచంటేశ్వరుని కల్యాణం

ఆచంట, మార్చి7: ఆచంటేశ్వరుని మహా శివరాత్రి కల్యాణోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం వేకువజామున స్వామి, అమ్మవార్ల కల్యాణం కన్నులపండుగగా జరిగింది. పార్వతి అమ్మవారిని శ్రీ రామేశ్వర స్వామి వారికి ఇచ్చి లోక కల్యాణార్థం స్మార్త విధానంలో బ్రహ్మశ్రీ శంకరమంచి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఆలయ సత్రం వద్ద అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వస్తున్న అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. శివరాత్రికి వేలాదిగా వచ్చే భక్తుల కోసం క్యూలైన్‌లు ఏర్పాట్లు చేశారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



వీరంపాలెంలో కలశస్థాపన

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 7: తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో శుక్రవారం శివరాత్రి వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో కళశస్థాపన నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రదక్షణ చేసి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భూప్రస్థార శ్రీచక్రార్చన చేశారు.



విద్యుద్దీపాలంకరణలో గునుపూడి సోమేశ్వరాలయం

మహిళలూ..మహారాణులూ..

వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఓటర్లలో మహిళలదే పై చేయి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఏలూరు సిటీ / భీమవరం, మార్చి 5: మహిళలూ..మహరాణులూ అంటోంది నవ సమాజం. కష్టమైన లక్ష్యసాధన కోసం కృషి చేసి అందని మన్ననలు అందుకుంటున్నారు. తెగువ, ధైర్యంతో అడుగు ముందుకేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తున్నారు. మనోధైర్యంతో రాజకీయాల్లో మహిళలు దూసుకుపోతున్నారు. వంటింటికే పరిమితం కాకుండా ఉద్యోగ, వ్యాపార రంగాలులో ముందుంటున్నారు. సమాజసేవలోను మహిళలు తమ ప్రత్యే కతను చాటుకుంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇది ప్రత్యేక కథనం.

మహిళా ఓటర్లే కీలకం



ఎన్నికలలో ప్రముఖ పాత్ర పోషించేది మహిళలే. అందుకే ఏ రాజకీయ పార్టీ అయినా ముందుగా మహిళలకు ప్రాధాన్యత కల్పించే పథకాలను ప్రవేశ పెడుతున్నాయి. ఏడాది కేడాదికి మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గత ఏడాది నవంబరులో ఏలూరు జిల్లాలో మొత్తం 15,86,744 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళా ఓటర్లు సంఖ్య 8,06,453. పురుష ఓటర్లకంటె మహిళా ఓటర్లు 26 వేల 277 మంది అధికంగా ఉన్నారు. ఇక ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో ఏలూరు జిల్లాలో మొత్తం ఓటర్లు 16,24,416 మంది ఉండగా ఇందులో మహిళా ఓటర్లు 8,30,390 మంది ఉన్నారు. పురుష ఓటర్లకంటె మహిళా ఓటర్లు 36 వేల 493 మంది అధికంగా ఉన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికలలోను మహిళా ఓటర్లదే కీలక పాత్ర ఉంటుందని చెబుతున్నారు. పశ్చిమలో ఈ ఏడాది జనవరి 22 తేదీన ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో అత్యధిక ఓట్లు మహిళలవే. జిల్లాలో మొత్తం ఓటర్లు 14,61,338 నమోదు కాగా, పురుష ఓటర్లు 7,16,956 మంది, మహిళా ఓటర్లు7,44, 308 మందిగా నమోదయ్యారు.

చట్ట సభల్లో సత్తా

ఎన్నికల్లో మహిళలు కీరోల్ పోషిస్తున్నారు. పార్లమెంటు సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, శాసనసభ్యులుగా, శాసన మండలి సభ్యులుగా విజయం సాధించి చట్టసభల్లో కీలక నిర్ణయాలు తీసుకుని పురుషులకు ధీటుగా మహిళలు రాజకీయాల్లో రాణిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పరిశీలిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు వాటా పెరుగుతూ వచ్చింది. 1955 లోనే తొలిసారిగా ఆత్తిలి నుంచి అభ్యర్థిగా అమ్మన్న రాజా గెలిచారు. నరసాపురం అసెంబ్లీలో 1981లో తొలిసారి పరకాల కాళికాంబ కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. ఉండి అసెంబ్లీలో స్వతంత్ర అభ్యర్థిగా 1970 జరిగిన ఉప ఎన్నికల్లో కే ఆండాలమ్మ గెలిచారు. 1983-87 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నుంచి ఈలి వరలక్ష్మి గెలిచారు. 1983లో ఎన్‌టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన తదుపరి మహిళల సంఖ్య స్పష్టంగా పెరుగుదల కనిపించింది. పెనుగొండ అసెంబ్లీ నుంచి 1983-85 ఎన్నికల్లో వరుసగా ప్రత్తి మణెమ్మ గెలుపొంది మంత్రి అయ్యారు. ఆచంట నుంచి 1999లో తొలిసారి టీడీపీ తరఫున మోచర్ల జోహార్‌వతి పోటీ చేసి తొలి మహిళగా రికార్డు నమోదు చేశారు. దెందులూరు నుంచి మాగంటి వరలక్ష్మి 1995లో కాంగ్రెస్ నుంచి గెలిసి మంత్రిగా వివరించారు. 2004లో పీతల సుజాత టీడీపీ నుంచే ఇక్కడి నుంచి రెండవ మహిళగా ఎమ్మెల్యే అయ్యారు. పాలకొల్లు అసెంబ్లీలో 2009లో బంగారు ఉషారాణి కాంగ్రెస్ నుంచి ఎన్నికయ్యారు. చింతలపూడి నుంచి పీతల సుజాత 2014 ఇక్కడి నుంచి తొలి మహిళగా ఎన్నికయ్యారు. కొవ్వూరు అసెంబ్లీ నుంచి తానేటి వనిత 2019లో ఎన్నికై మంత్రి అయ్యారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు భారీగా వసూళ్లు

ఆకాశరామన్న ఫిర్యాదుపై డీఎంహెచ్‌వో వివరణ..

15న విచారణకు రాష్ట్ర బృందం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 7 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాల భర్తీకి రాష్ట్రస్థాయి అధికారి మొదలుకుని జిల్లాస్థాయి అధికారి వరకు లంచం/ ముడుపులు ఇవ్వాల్సి ఉంటుదంటూ తమ వద్ద లక్షలు తీసుకున్న ఓ అధికారి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడంటూ జిల్లాకు చెందిన ఓ స్టాఫ్‌నర్సు ఉద్యోగార్థి విజయవాడలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు ఈనెల 15న రాష్ట్రస్థాయి అధికారుల బృందం జిల్లాకు రానుందని, వాస్తవానికి ఫిర్యాదు చేసిన పేరుగల వ్యక్తి ఎవరూ లేనేలేరని ఎవరో తమశాఖపై బురద జల్లేందుకే ఆకాశరామన్న లేఖలతో ఫిర్యాదు చేస్తున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట గురువారం వివరణ నిచ్చారు. ఫిర్యాదు వివరాలు ఇలాఉన్నాయి. జిల్లాలో స్టాఫ్‌నర్సు పోస్టులను ఇప్పిస్తానంటూ వైద్యఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఇన్‌చార్జి అధికారి ఆరుగురు అభ్యర్థినుల నుంచి లక్షన్నర చొప్పున మొత్తం రూ.9 లక్షలు వసూలు చేశారని జి.అరుణ పేరిట వైద్యఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతికి ఫిబ్రవరి 24న ఓ ఫిర్యాదు అందింది. రెండునెలలుగా పోస్టింగ్ ఆర్డర్ల కోసం ఇన్‌చార్జి అధికారికి ఫోన్ చేస్తే ఏవో సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.తమతో అసభ్యకరంగా ఫోన్ సంభాషణలు చేస్తున్నారని, వీటికి సంబంధించి సెల్‌ఫోన్ వాయిస్ రికార్డుల సాక్ష్యాలు తమవద్ద ఉన్నాయని ఫిర్యాదుదారు వివరించారు.ఈ తతంగమంతా డీఎంహెచ్‌వో కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులకు తెలుసునని పేర్కొన్నారు. తమకు న్యాయంచేసి డబ్బులు ఇప్పించాలని అభ్యర్థించారు. ఈ ఫిర్యాదుపై డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వివరణ ఇచ్చారు. ఉద్యోగాల భర్తీ జరిగితే నోటిఫికేషన్ ప్రక్రియ మేరకే జరుగుతాయి. పోస్టింగ్‌లను అభ్యర్థుల ఇళ్లకే పంపించడం ఎక్కడా జరుగదు. తాజా ఫిర్యాదుపై విచారణ అధికారులను ఈనెల 15న జిల్లాకు పంపిస్తున్నట్టు డైరెక్టరేట్ నుంచి సమాచారం అందింది. ఫిర్యాదుదారు పూర్తి వివరాలు, సాక్ష్యాలతో విచారణకు హాజరైతే వాస్తవాలు బయటపడతాయన్నారు.

4.5 టన్నుల ఎర్ర చందనం పట్టివేత



ద్వారకాతిరుమల, మార్చి7: ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్న ఓ మినీ కంటైనర్‌ను, దానికి ఎస్కార్ట్‌గా ఉన్న రెండు వాహనాలను ద్వారకాతిరుల మండలం పంగిడిగూడెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ మేరీప్రశాంతి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్, ఎస్ఐ సతీష్‌లు గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకు దాడి చేశారు. వాహనంలో ఉన్న 248 ఎర్రచందనం దుంగలు (సుమారు 4.5 టన్నులు) ద్వారకాతిరుమల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 9 మందిని, అరెస్ట్ చేశారు. నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి ఏలూరు జిల్లా టి.నరసాపురంలోని ఓ రైతు నుంచి హర్యానాకు అక్రమంగా ఈ చందనాన్ని తరలిం చేందుకు రూ.3 లక్షలతో ఓ మినీ కంటైనర్‌ను కిరాయికి మాట్లాడు కున్నాడు. కంటైనర్‌లో పాత ఇంటి సామగ్రి వేసి దానికింద ఎర్ర చందనం దుంగ లను ఉంచి తరలించేందుకు ప్లాన్ చేశారు. కంటైనర్‌కు ముందూ వెనుకా కార్లు ఎస్కార్ట్‌గా ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వీటిని పంగిడిగూడెం వద్ద పట్టుకుని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. నెల్లూరుకు చెందిన వ్యక్తితో పాటు కర్నూలుకు చెందిన మరో వ్యక్తి పూర్తి సహాయ సహకారాలు అందించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సెల్‌ఫోన్ దొంగలించాడని కట్టేసి కాళ్లకు నిప్పు


ఎనిమిది మంది అరెస్టు ..హత్యాయత్నం కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 7 : సెల్‌ఫోన్ అపహరించాడని ఒక వ్యక్తిని బస్సు వెనుక కట్టేసి చిత్రహింసలకు గురిచేసి ఆపై కాళ్లపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి ఏలూరు కొత్త బస్టాండ్‌లో ముఠా కూలీ తురకా గోపీకి సంబంధించిన సెల్‌ఫోన్‌ను కరిముజ్జి బాలగోపీ అపహరించాడు. దీంతో ముఠా కూలీలు అతనిని బస్సు వెనుక కట్టేసి చిత్రహింసలకు గురి చేసి ఆపై కాళ్లపై పెట్రోలు పోసి నిప్పంటించారు. గాయాలపాలైన అతను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలగోపీపై దాడిచేసిన ఏలూరు చిరంజీవి, తురకా గోపీ, వేముల ఇస్సాకురాజు, మళ్ళా మురళీకృష్ణ, దాసిపల్లి ఆదినారాయణ, వేముల చిన్ని, వల్లెపు రామయ్య, తురకా తిరుపతిరావు, వల్లెపు రత్నరాజులను అరెస్టు చేశారు. వీరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి యువకుని మృతి

ఏలూరు క్రైం, మార్చి 7 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు - పాతూరు రైల్వే గేటు సమీపంలో ఒక యువకుని మృతదేహం ఉందని ఏలూరు రైల్వే పోలీసులకు గురువారం సమాచారం అందింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ప్రకాష్‌మండల్ (19)గా గుర్తించారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పట్టిసీమ ఉత్సవాల్లో అపశృతి.. విద్యుదాఘాతంతో యువకుడి మృతి



పోలవరం, మార్చి 7 : పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం ఉత్సవాల విద్యుత్ లైటింగ్ పనులు చేస్తున్న పట్టిసీమ గ్రామానికి చెందిన పెంటపాటి హర్ష (22) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. హర్ష పట్టిసీమ నూతన ఫెర్రీ సమీపంలో ఏటిగట్టుపై లైటింగ్ పనులు చేస్తున్న నేపథ్యంలో పైనుంచి వెళుతున్న 11 కేవీ వైర్ల కిందకు ఇచ్చిన కనెక్షన్ వైరు కింద పడి ఉండడం గమనించక పాదరక్షలు లేకుండా తొక్కడం వల్ల ప్రమాదం సంభవిం చిందన్నారు.వెంటనే 108 వాహనంలో తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 7: ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం చినతాడేపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. నీలాద్రిపురానికి చెందిన సుధగాని బుల్లిరాజు (17) తాడేపల్లిగూడెం వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో బుల్లియ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు, బుల్లియ్య కొమ్ముగూడెం పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేశ్ తెలిపారు.


ఆర్థిక ఇబ్బందులు తాళ లేక ఒకరి ఆత్మహత్య

భీమడోలు, మార్చి 7 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక భీమడోలులో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు భీమడోలు పోలీసులు తెలిపారు. భీమడోలుకి చెందిన చెన్నం నాగేశ్వరరావు తన కుటుంబంతో ఏలూరులోని శనివారపు పేటలో నివసిస్తున్నాడు. ఆర్థిక పరిస్థితులు తట్టుకోలేక కొంత కాలంగా మనోవేదనకు గురయ్యాడు. దీంతో బయటకు వెళుతున్నానని చెప్పి భీమడోలు శివారులో ఉన్న పొలాల మధ్య చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అతని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

కోడిపందేలపై దాడి..16 మంది అరెస్టు

కాళ్ళ, మార్చి 7 : కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 16 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ళ ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. కాళ్ళ మండలం దొడ్డనపూడి గ్రామ శివారు కచ్చా గరువు ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి 16 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.50,190 నగదు, 2 కోడిపుంజులు,32 కోడికత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తిమ్మిరెడ్డిపల్లిలో రేషన్ బియ్యం పట్టివేత



చింతలపూడి, మార్చి 7 : చింతలపూడి మండలం తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో విజిలెన్స్ అధికారులు, పౌర సరఫరాల అధికారులు గురువారం దాడి జరిపి అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన కొప్పాల రాజు అనే వ్యక్తి ఇంట్లో 2 వేల 500 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని శంఖుచక్రపురం గ్రామానికి చెందిన కటారి చెన్నారావు కలిసి కాకినాడకు చెందిన చోడిశెట్టి మహేష్ అనే వ్యక్తికి అమ్ముతుండగా పట్టుకున్నట్టు పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ జరీనా తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని, ఈ దాడిలో విజిలెన్స్ ఎస్ఐ రంజిత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కి'లేడీ'లు



జ్యూయలరీ దుకాణంలో చేతివాటం!!

గిల్టువి పెట్టి బంగారం నొక్కేశారు

సీసీ కెమేరాకు చిక్కిన వైనం

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 7: బంగారం దుకాణానికి వెళ్లి బంగారు ఉంగరాలు కొట్టేసి రోల్డ్‌గోల్డ్ పెట్టి ఉడాయించిన సంఘటన జంగారెడ్డిగూడెంలో చోటుచేసుకుంది. మసీదు సెంటర్‌లో ఉన్న సాయిశ్రీ జ్యూవెలర్స్‌లో ఇద్దరు మహిళలు బంగారం కొనుగోలు చేయడానికి వచ్చారు. శుభకార్యం ఉందని ఉంగరాలు చూపించమనడంతో ఉంగరాలను అందించాడు. వారికి ఎటువంటి అనుమానం రాకుండా బంగారపు ఉంగరాలు కాజేసి వాటి స్థానంలో రోల్డ్ గోల్డ్ ఉంగరాలను ఉంచారు. మళ్లీ వస్తామంటూ కొనుగోలు చేయకుండా అక్కడ నుంచి వెళ్లిపోయారు. యజమానికి అనుమానం రావడంతో సీసీ కెమేరాలు పరిశీలించారు. సుమారు కాసు బరువున్న రెండు ఉంగరాలు కాజేసినట్లు గుర్తించారు. బుధవారం మునిసిబ్ గారి వీధిలో మరో జ్యూయలరీ దుకాణంలో సుమారు కాసున్నర బంగారం కాజేసినట్లు తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గొల్లలకోడేరులో మిస్సింగ్... కేసు నమోదు



పాలకోడేరు, మార్చి 7 : గొల్లలకోడేరు గ్రామానికి చెందిన వేగేశ్న విజయభాస్కరరాజు ఫిబ్రవరి 20వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ కుమారుడు లీలా రామ కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు. వృద్ధుడైన విజయ భాస్కర రాజు ఫిబ్రవరి 20వ తేదీన ఇంటి నుంచి వెళ్ళే సమయంలో తెల్లటి టీషర్ట్, షార్ట్ ధరించి ఉన్నారన్నారు. బంధువుల ఇంటి వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా సమాచారం లేకపోవడంతో మిస్సింగ్ కేసు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకి తెలిస్తే 94407 96650కి సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

రూ.215.39 కోట్ల చేయూత : కలెక్టర్


చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 7: జిల్లాలో వైఎస్సార్ చేయూత పథకంలో నాలుగోవిడత 1,14,874 మందికి రూ.215.39కోట్లను మహిళల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, మెప్మా పీడీ ఇమ్మానియేలు, పశుసంవర్ధకశాఖ జేడీ జి.నెహ్రూబాబు చేయూత లబ్ధిదారులతో కలసి గురువారం సీఎం ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం నమూనా చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు.

ఓటర్లు మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

వేలేరుపాడు, మార్చి 7: ఎన్నికల సమయం ఆసన్నమైందని ప్రతి ఓటరు మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య సూచించారు. సీపీఐ మండల సమావేశం గురువారం నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలిసిన వ్యక్తిని ఎన్నుకుంటే పరిష్కారం అవుతాయన్నారు. గడిచిన పదేళ్లుగా నిర్వాసితులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి నిరంతరం పోరాడే నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలన్నారు. నిర్వాసితుల పక్షాన సిపిఐ అనేక పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమితో సీపీఐ ముందుకు సాగుతుందన్నారు. ఎండీ మునీర్, సన్నేపల్లి సాయిబాబు, కారం ధారయ్య, సర్పంచ్ పిట్ట ప్రసాద్, రమణ రాజు, ఎర్ర మధు, కరటం సీతామహాలక్ష్మి, పిట్ట జయమ్మ, పిట్ట వీరయ్య, కరటం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి మోదీని గద్దె దింపాలి


సమావేశంలో నాయకుల అభివాదం

ఏలూరు టూటౌన్, మార్చి 7: రైతు వ్యతిరేకి మోదీని గద్దె దింపాలని సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా సమావేశం తీర్మానించింది. అన్నే భవన్‌లో గురువారం రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల సమావేశం జరిగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని మోదీ నాశనం చేస్తున్నారన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకురాకుండా రైతులను నష్టలపాలు చేస్తున్నారని అన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ నెల 14న ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో సంయుక్త కిసాన్ మోర్చ అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కె.శ్రీనివాస్, ఆర్.లక్ష్మణరావు, వెంకట్రావు, బండి వెంకటేశ్వరరావు, జగన్నాధరావు, శ్రీనివాసడాంగే, నిమ్మగడ్డ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు బీజేపీ కారణం


సభలో మాట్లాడుతున్న నాయకులు

పోలవరం, మార్చి 7: మణిపూర్, ఉత్తరప్రదేశ్‌లో మహిళలపై దాడులు, అత్యాచారాలకు బీజేపీ కారణమని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు అన్నారు. అంతర్జాతీయ మహిళల పోరాట దినం సందర్భంగా గురువారం జిల్లెళ్లగూడెం సచివాలయం వద్ద స్త్రీ విముక్తి సంఘటన అధ్వర్యంలో సభ నిర్వహించారు. అధ్యక్షురాలు తాతి చిన్ని మాట్లాడుతూ మహిళల హక్కులను కాలరాస్తూ దాడులను హింసను ప్రేరేపిస్తున్న మతతత్వ రాజకీయాలు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కుంజం రామారావు మాట్లాడుతూ కొత్త కొత్త చట్టాలు తెచ్చి అడవులను సామ్రాజ్యవాద శక్తులకు అప్పగించి లక్షలాది గిరిజనులను నిరాశ్రయులు చేయడానికి పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. వాటిని వ్యతిరేకించడానికి మహిళలు సంఘటిత శక్తులుగా ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. షేక్ బాషా, సవలం రాంబాబు, కలుం సూర్యకాంతం, కోటం బుచ్చమ్మ, కారం దుర్గ పాల్గొన్నారు.

పెద వెల్లమిల్లిలో జనంలోకి జనసేన


సమస్యలు తెలుసుకుంటున్న ధర్మరాజు

ఉంగుటూరు, మార్చి 7: రానున్న ఎన్నికలలో జనసేన, తెలుగుదేశం కూటమిని గెలిపించాలని జనసేన నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు కోరారు. మండలంలోని పెద వెల్లమిల్లిలో గురువారం జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉంగుటూరు, నిడమర్రు మండలాల అధ్యక్షులు పంది రాంబాబు, నిమ్మల దొరబాబు, పగడాల ప్రసాద్, కంభంపాటి రమేష్, గరగ వెంకట్, ఆకుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కైకరం, తల్లాపురంలో సాయుధ బలగాల కవాతు


కైకరంలో సాయుధ బలగాల కవాతు

ఉంగుటూరు, మార్చి 7: రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి భద్రతా బలగాలు చర్యలు చేపడుతున్నాయి. చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోని కైకరం, తల్లాపురం గ్రామాలలో గురు వారం సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. సీఐ మోగంటి వెంకట సుభాష్, ఎస్ఐ ఎ.మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత సదస్సు



ఆన్‌లైన్ సదస్సులో అధ్యాపకులు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 7 : సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర విభాగం అధ్వర్యంలో గురువారం గణితంపై ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ అధ్యక్షతన సదస్సు జరిగింది. విద్యార్థులను మంచి ఉన్నత స్థానాలకు చేర్చడానికి ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఆర్.రాధ, ఎస్.దుర్గాభవాని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. బి.శ్రీనివాసరావు, సీహెచ్.బదరీనారాయణ ఎం.మధు, యు.వెంకటాచార్యులు, కె.ఉత్తమ్ సాగర్, పీఎస్ రావు, రమాదేవి, ఆర్.విజయ్ దీపిక పాల్గొన్నారు.

సహకార సంఘాల గోదాములు ప్రారంభం

టి.నరసాపురం, మార్చి 7: మండలంలో మక్కినవారిగూడెం, తిరుమల దేవి పేట గ్రామాల్లోని సొసైటీల అధ్వర్యంలో నిర్మించిన మల్టీపర్పస్ గోదా ములను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం ప్రారంభించారు. కొల్లివా రిగూడెం, నాయకులగూడెం, వల్లంపట్ల పాఠశాలల అభివృద్ధి పనులు, టి.నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన మహిళ జూనియర్ కళాశాల, అల్లంచర్ల రాజుపాలెంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్ ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్, వల్లంపట్లలో ఆర్బీకే ప్రారంభించారు. అనంతరం పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. తెల్లం రాజ్యలక్ష్మి, జడ్పీటీసీ సూర్యనారాయణ రాజు, ఎంపీపీ డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ బుర్ల దివ్య భారతి, సర్పంచ్ మోదుగు సునంద, సోముల సత్యనారాయణ, ఎంపీటీసీలు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊబిలో చిక్కుకున్న గేదెల కాపరి గల్లంతు

ఏలూరు క్రైం / పెదపాడు, మార్చి 7: పెదపాడు మండలం వట్లూరు గ్రామానికి చెందిన గేదెల కాపరి వసంతవాడ ఏడుకొండలు (50) గంగానమ్మ గుడి వెనుక గల చెరువు ఊబిలో చిక్కుకుపోయి గల్లంతైన ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఏడుకొండలు ఉదయం 11 గంటల సమయంలో చెరువు వద్ద గేదెలు మేపు తుండగా గట్టు దాటి లోనికి వెళ్లిన గేదెలను తిరిగి తీసుకువచ్చే నిమిత్తం చెరువులోకి వెళ్లాడు. బురదతో నిండి వున్న ఊబిలో చిక్కుకుని బయటకు రాలేకపోయాడు. ఏడుకొండలు గల్లంతు కావడంతో స్థానికులు సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టిన ఆచూకీ లభించలేదు.

ప్రమాదంలో సచివాలయ ఉద్యోగికి గాయాలు

ఉంగుటూరు, మార్చి 7: కైకరంలో ఈ నెల 4న ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి గాయపడ్డాడు. సచివాలయ జూనియర్ అసిస్టెంట్ మద్ది శేషుబాబు ద్విచక్ర వాహనంపై తాడేపల్లిగూడెం వెళుతుండగా సోమా వద్ద చేబ్రోలు వైపు వెళుతున్న వ్యాన్ ఢీకొంది. గాయపడిన శేషుబాబును ప్రైవేటు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం రాజమ హేంద్రవరం తరలించారు. ఆయన కుమారుడి ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.



లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారికి సత్కారం



భీమడోలు కళాశాలలో వైద్యులు, అధ్యాపకులకు సత్కారం



చింతలపూడిలో మాట్లాడుతున్న న్యాయాధికారి మధుబాబు


పోలవరంలో టీచర్‌కు పూర్వ విద్యార్థుల సత్కారం

మహిళకు వందనం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలు



సీఆర్‌ఆర్ కళాశాలలో జేసీ లావణ్యవేణికి సత్కారం

ఏలూరు క్రైం, మార్చి 7: కుటుంబ సంరక్షణ, నిర్వహణతో పాటు ఉద్యోగం, ఆలోచన విధానంలో పురుషులతో పోలిస్తే మహిళలు ముందుంటారని శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ అధ్యక్షతన గురువారం మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటూ మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. మహిళలు వారి ఆరోగ్యం కూడా సంరక్షించుకోవాలని తెలిపారు. మహిళలకు సంబంధించి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సదస్సులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకె బుల్లికృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్, జిల్లా వినియోగదారుల సభ్యురాలు నాగలక్ష్మి సమాజంలో మహిళల పాత్ర, ఆర్థిక స్థితిగతులు, మహిళా సాధికారత, మహిళా విద్య, తదితర అంశాలపై సదస్సులో వివరించడం జరిగింది. అనంతరం మేరీ గ్రేస్‌కుమారి, జిల్లా వినియోగదారుల సభ్యురాలు నాగలక్ష్మి, ఛానల్ అడ్వకేట్ ఆకుల గంగాభావానిని సన్మానించారు. కెకె.బుల్లికృష్ణ, జి.దుర్గా ప్రసాద్, ప్యానల్ న్యాయవాదులు సీపీఎల్ఎస్, సిబ్బంది మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు కలెక్టరేట్: మహిళలు మహారాణులని సమాజాభి వృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. డీపీవో కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. డీపీవో దంపతులు ఉద్యోగులను శాలువా కప్పి సత్కరించారు. సీడీపీవో రాజశేఖర్, కె.సునీత, మల్లిక, జి.విజయ, పాతిమ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, తహేర, సోములు, పి.సత్యనారాయణ, భాస్కర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సీఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ బి.లావణ్యవేణిని సత్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతకు విద్యే ప్రధానాస్త్రమన్నారు. సీఆర్‌ఆర్ విద్యా సంస్థల కార్యదర్శి మాగంటి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత స్థానాల్లోకి వెళ్లాలంటే గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీపడాలని, తల్లితండ్రుల గౌరవాన్ని పెంచాలని సూచించారు. కరస్పాండెంట్‌లు విష్ణు మోహన్, కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ లావణ్య, లక్ష్మీసరస్వతి పాల్గొన్నారు.

కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు పద్మావతి, కావ్యశ్రీ, సుశ్యలత, మహిళా సాధికారత కోఆర్డినేటర్ ఉదయలక్ష్మిని సత్కరించారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, కె.బి.రావు, సత్యనారాయణ, ఎల్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. శ్రీ శర్వాణీ హైస్కూల విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. సామంతుల ఝాన్సీలక్ష్మి, టీచర్లను సత్కరించారు. బి.హేమసుందరి, హెచ్ఎం సత్యశారద, మదనమోహనరాజు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: పట్టణంలోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ కాసర లక్ష్మీసరోజా రెడ్డి అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. నేటి సమాజంలో మహిళ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉపాధ్యాయిని ఉషాకిరణ్‌ను ఘనంగా సత్కరించారు. సింధూషా రెడ్డి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి జె.కల్పనారాణి అన్నారు. పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కల్పనారాణి మాట్లాడుతూ ఆడ పిల్లలకు అవకాశాలు కల్పిస్తే పురుషులతో సమానంగా రాణిస్తారన్నారు. మదర్ థెరిసా, మేడం క్యూరీ, సావిత్రి బాయి పూలే, ఝాన్సీలక్ష్మీబాయి వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కల్పనారాణిని ఘనంగా సన్మానించారు. విజయలక్ష్మి, వరలక్ష్మి, అరుణ, మహాలక్ష్మి, పుష్పవతి, ఎస్తేరు రాణి, మధులత, రమ్యశ్రీ, మౌనిక, రాజేశ్వరి పాల్గొన్నారు.

● చింతలపూడి: మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ప్రత్యేక చట్టాలు తెలుసుకోవాలని న్యాయాధికారి సి.మధుబాబు సూచించారు. సీడీపీవో కార్యాలయంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ధైర్యంగా సమస్యలపై న్యాయ పోరాటం చేయాలని, చట్టాలపై అవగాహన ఉండాలని పలు చట్టాలపై వివరించారు. సీడీపీవో మాధవి, న్యాయవాదులు ఫరూఖ్, డేవిడ్‌రాజు, ఎం.డి.అక్బర్ ఆలీ పాల్గొన్నారు.


డీపీవో కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు సత్కారం

● భీమడోలు: వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సామాజిక వైద్య కేంద్రంలోని మహిళా వైద్యులు, అధ్యాపకులను సత్కరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీత మాట్లాడుతూ విద్యార్థినులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థితిని పొంది సమాజాన్ని, కుటుంబాన్ని చక్కదిద్దాలని సూచించారు. వైద్యులతో పాటు జూనియర్ లెక్చరర్ లీలాకుమారిని సత్కరించారు. ఎన్ఎస్ఎస్ సేవా విభాగం అధికారి శశికాంత్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఆఫీసర్ కె.శివశంకర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం: మహిళా దినోత్సవం సందర్భంగా పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మహిళా ఉపాధ్యాయులను, ఇతర మహిళలను 1984-85లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సన్మానించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు. పదో అధిక మార్కులు సాధించిన ఇద్దరికి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. పూర్వ విద్యార్థులు శివరామకృష్ణ, అనంతకృష్ణ బాలాజీ, రవీంద్ర. మేషెక్ బాబు, పుతలి, విజయలక్ష్మి, భాగ్యరేఖ, శ్రీనివాస్, సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: కవ్వగుంట అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. సీడీపీవో కె.విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. ప్రతి మహిళా విద్యావంతురాలైతేనే ఆర్థిక స్వావలంబన సాధ్యపడుతుందని, దీనికోసం అందరూ కృషి చేయాలని ఆమె చెప్పారు. మహిళలను సమానంగా చూడాలన్నారు.


ఏలూరులో ప్రజా సంకల్పయాత్రలో బడేటి చంటి


చింతలపూడిలో రోషన్‌కుమార్‌కు మహిళల హారతులు

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

సూపర్ 6 పథకాలు ప్రచారం చేస్తున్న నాయకులు

ఏలూరు టూటౌన్, మార్చి 7: టీడీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని టీడీపీ నేతలు అన్నారు. జనసేన ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై ప్రజలు హర్షతి రేకం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 7వ డివిజన్‌లో ప్రజాసంకల్ప యాత్ర గురువారం నిర్వహించారు. జగన్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. బీసీ సంఘాలకు కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడానికి స్థలాలు ఇవ్వకుండా ఎగ్గొడదామని ఎమ్మెల్యే ఆళ్ల నాని చూస్తున్నారని చంటి ఆరోపించారు. మారం హనుమంతరావు, మురళీకృష్ణ, శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరనున్న వైసీపీ కార్పొరేటర్

ఏలూరు టూటౌన్ / రూరల్, మార్చి 7: వైసీపీ కార్పొరేటర్ టీడీపీలో చేరనున్నారు. 36వ డివిజన్ కార్పొరేటర్ భీమవరపు హేమసుందరి వైసీపీకి గురువారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్‌కు అందజేశారు. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆమె లేఖలో పేర్కొన్నారు. వైసీపీ, ఎమ్మెల్యే నాని విధానాలు నచ్చక టీడీపీలో చేరుతున్నట్లు హేమసుందరి ప్రకటించారు. ఈ నెల 10న టీడీపీలో తన అనుచరులతో టీడీపీలో చేరుతున్నామని ఆమె తెలిపారు.

● చింతలపూడి: తెలుగుదేశం, జనసేన అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పట్ట ణంలో గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. భట్టువారిగూడెం, వడ్డెరగూ డెం, వైఎస్సార్‌కాలనీ, ఆర్కె నగర్, ఆశ్రమం వీధులలో ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమ సమస్యలను మొరపెడుతూ విజ్ఞప్తులు చేశారు. రోడ్లు లేవని, డ్రైయినేజీలు లేవని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రోషన్‌కు మహిళలు హారతులు పట్టి సమస్యలు నివేదించారు. రోషన్ కుమార్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన ప్రభుత్వం వస్తే అభివృద్ధి, సంక్షేమం జరుగుతాయన్నారు. ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలన్నారు. జగ్గవరపు ముత్తారెడ్డి, కె.రాజశేఖరరెడ్డి, పక్కాల వెంకటేశ్వరరావు, కొత్తపూడి శేషగిరిరావు, బోడా అనీష్‌కుమార్, కోంద్రు దేవ, బోడా నాగభూషణం, తాటి అప్పారావు, నత్తా రవికుమార్, జనసేన నాయకులు టి.నాగవిజయకుమార్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

● పెదవేగి: టీడీపీ, జనసేన సంయుక్తంగా ప్రకటించిన ఆరు (సూపర్ సిక్స్) పథకాలు పేదల అభ్యున్నతికి దోహదపడతాయని టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్ అన్నారు. బాపిరాజుగూడెంలో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో అంశాలను వివరించారు. ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. మద్దాల సహదే వుడు, పులిచర్ల సుందరయ్య, తలకొండ జమలయ్య, బొప్పన మార్కండేయులు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


ముంజులూరులో బొరగం శ్రీనివాస్

● బుట్టాయగూడెం: ముంజులూరు కొండరెడ్డి గ్రామంలో బొరగం శ్రీనివాస్ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాల ను వివరించారు. ఈ కార్యక్రమంలో సున్నం నాగేశ్వరావు, మొడియం సింగరాజు, పాయం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

ద్వారకాతిరుమల: టీడీపీ, జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌ను హర్షిస్తూ బీసీ నేతలు చంద్రబాబు చిత్రపటానికి గురువారం పాలభిషేకం చేశారు. స్థానిక వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో చంద్రబాబు చిత్రపటాన్ని ఉంచి పాలతో అభిషేకిం చారు. వైసీపీ బీసీల ప్రాధాన్యతను తగ్గించడంతో పాటు తమహక్కులను కాల రాసిందన్నారు. కార్యక్రమంలో గంటా బాబ్జి, ఇమ్మడి రత్నాజి, కూనపాముల రామారావు, తాటి చిన్ని, రాసప్రోలు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కైకరం హైస్కూలు వార్షికోత్సవం


అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఉంగుటూరు, మార్చి 7: వార్షికోత్సవాలు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలకు ఉపయోగ పడతాయని జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి అన్నారు. కైకరం జడ్పీ హైస్కూలు వార్షికోత్సవం గురువారం జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎంఈవో కాండ్రేగుల శ్రీనివాసరావు, జడ్పీటీసీ జయలక్ష్మి, ఎ.గోకవరం సర్పంచ్ మిద్దే సత్యవతి, హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పోటీలలోని విజేతలకు బహుమతులు అందించారు.

వేసవిలో మంచినీటి సమస్య పరిష్కరించాలి

చింతలపూడి, మార్చి 7: గ్రామాల్లో వేసవి మంచినీటి సమస్య పొంచి ఉందని, పరిష్కారం చూపాలని పలువురు సర్పంచ్‌లు మండల పరిషత్ సమావేశం దృష్టికి తెచ్చారు. మండల పరిషత్‌లో ఎంపీపీ డి.రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీతానగరం, గణిజర్ల సర్పంచ్‌లు సమస్యలు వివరించారు. ఎంపీపీ డి.రాంబాబు మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా మంచినీటి ఎద్దడి రాకుండా ముందుగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. సమావేశంలో జడ్పీటిసి నీరజ, ఎంపిడిఓ రాటాలు పాల్గొన్నారు.

మండల సమావేశానికి ప్రజాప్రతినిధుల డుమ్మా

లింగపాలెం, మార్చి 7: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మునునూరి వెంకటలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశానికి పలువురు అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా హాజరుకాలేదరు. పీఆర్ ఏఈ జగన్నాథం రహదారి మరమ్మతు పనులు వివరించారు. పలువురు సభ్యులు వేసవి నీటి ఎద్దడి సమవేశం దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో జల జీవన్‌మిషన్ ద్వారా గ్రామాల్లోకి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. తహసీల్దార్ పీఎన్‌వీ.ప్రసాద్, ఎంపీడీవో రాంబాబు, ఏవో మురళీకృష్ణ, జడ్పీటీసీ హరినాథ్‌రాజు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తున్న మహిళపై కేసు

టి.నరసాపురం, మార్చి 7: సారా తయారీ కేంద్రంపై దాడి చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. తిరుమల దేవిపేట మద్యాహ్నపువారి గూడెంలో సారా తయారీ సమాచారంతో సిబ్బందితో గురువారం దాడి చేశారు. మహిళ వద్ద పది లీటర్ల సారా స్వాధీనం కేసు నమోదు చేశామన్నారు

ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యతేజ

బుట్టాయగూడెం, మార్చి 7: సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. రాజకీయ పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ వరకు ఎన్నికల నిర్వహణ, విధులు వివరించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అందరూ సహకారం అందించాలని కోరారు. కన్వీనర్ బొరగం శ్రీనివాస్, శావిలి సుభాష్ చంద్రబోస్, మానెల్లి బాలు, మొడియం సింగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, మొడియం శ్రీనివాసరావు, గుగ్గులోతు మోహనరావు, కారం దారయ్య, బాడిస రాము, రమణరాజు, జమ్మి శ్రీనివాసరావు, కొప్పుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'అంజుమన్' ఎన్నికల లెక్కింపు నిలిపివేత

ఏలూరు కల్చరల్, మార్చి 7: అంజుమన్ సంస్థ ఎన్నికల కౌంటింగ్ నిలిపివేయాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చారు. అంజుమన్ సంస్థ ఎన్నికలు బైలా ప్రకారం నిర్వహించటం లేదని సంస్థ మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మస్తాన్ బాషా జిల్లా కోర్టులో కేసు ఫైల్ చేశారు. అంజుమన్ సంస్థలో కొత్తగా పొందుపరిచిన ఓటర్ జాబితాలో దొంగ ఓట్లు ఉన్నాయని, అడ్‌హాక్ కమిటీ బైలాకు వ్యతిరేకంగా ఎన్నికలు జరిపిస్తున్నారని కోర్టులో ఫిర్యాదు చేశారు. మోసపూరితంగా ఎన్నికలు జరిపిస్తున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 9న జరిగే ఎన్నికలు యదావిధిగా నిర్వహించి కౌంటింగ్ మాత్రం నిలిపివేయాలంటూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారని మస్తాన్ బాషా తెలిపారు. పాత, కొత్త కమిటీ ఓటర్‌లిస్ట్ తమ ఎదుట హాజరు పరచాలని తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఎటువంటి చర్యలు తీసు కోవద్దని ఆదేశాలు జారీ చేశారని మస్తాన్ బాషా తెలిపారు.

పరిశ్రమల్లో వాయు విపత్తుపై మాక్ డ్రిల్

ఉంగుటూరు, మార్చి 7: పరిశ్రమల్లో ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిస్తూ నారాయణపురం ప్రిజమ్ జాన్సన్ పరిశ్రమలో గురువారం వాయు విపత్తుపై మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో బాధితులకు చికిత్స ఆస్తి నష్టం నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆర్డీవో ఖాజావలి వివరించారు. విపత్తుల శాఖ జిల్లా అధికారి, తహసీల్దార్ కె.వెంకట శివయ్య ఇన్‌చార్జి ఎంపీడీవో శర్మ, ఆంజనేయులు, చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డా.వర్మ, ఆరోగ్య సిబ్బంది పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

రావణ వాహనంపై శివదేవుని గ్రామోత్సవం



ద్వారకాతిరుమల, మార్చి7: శేషాచలం పై ఉన్న ఆలయంలో శివదేవుని కల్యాణ మ హోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం వేద పారాయణ, శివునికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం గంగా పార్వతీ సమేత శివుని ఉత్సవమూర్తులను రావణ వాహనంలో ఉంచి పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల నడుమ క్షేత్రంలో జరిగిన ఉత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. శుక్రవారం రాత్రి లింగోద్భవ సమయంలో జరుగనున్న కల్యాణం నిర్వహిస్తామని ఈవో త్రినాథరావు తెలిపారు.

నేటి నుంచి మేధా దక్షిణామూర్తి ఉత్సవాలు

దెందులూరు, మార్చి 7: దక్షిణ కాశీగా పేరుపొందిన శివాలయాల్లో అతిపురాతనమైనది చల్ల చింతలపూడి శివాలయం. కాశీకి వెళ్లలేనివారు ఇక్కడ దక్షిణామూర్తిని దర్శిస్తే కాశీలో శివుడిని దర్శించిన ఫలింత దక్కుతుందని భక్తుల నమ్మకం. ఆలయంలో శుక్రవారం నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోనున్న నేపథ్యంలో అన్ని చర్యలు తీసుకున్నట్లు ఉత్సవ నిర్వాకులు తెలిపారు.

తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శైవక్షేత్రాల్లో అల్పాహారం


అల్పాహార పంపిణీ స్టాల్

పెదవేగి, మార్చి 7: మహాశివరాత్రికి ప్రముఖ శైవక్షేత్రాల్లో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు చేశామని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపన చౌదరి) గురువారం తెలిపారు. బలివే పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకోసం 80వేల మందికి విజయరాయిలో మూడు రకాల అల్పాహారం ఏర్పాటు చేశామన్నారు. పోలవరం మండలం పట్టిసీమ, జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి, కలిదిండి మండలం భోగేశ్వరం శైవక్షేత్రాల్లో అల్పాహారం స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. మజ్జిగ, మంచినీటి సరఫరా ఏర్పాట్లు కూడా చేశామని ఆయన తెలిపారు.

ఘనంగా సాయి మందిర వార్షికోత్సవం

ఏలూరు కల్చరల్, మార్చి 7: సాయి నామస్మరణతో దొండపాడు గ్రామం మార్మోగింది. షిరిడీ సాయి దివ్యలీలా మందిరం వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం బాబాకు విశేష పూజలు, కాకడ హారతి, దత్తాత్రేయుడికి పంచామృతాలతో అభిషేకం, విశేష అలంకారం నిర్వహించారు. సాయంత్రం పల్లకి ఊరేగింపు, సంధ్యా హారతి తదుపరి పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా 8న ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధనను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

ఏలూరు రూరల్, మార్చి 7: మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ళ నాని తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు ఎమ్మెల్యే ఆళ్ళనాని మాట్లాడుతూ మహిళల లక్ష్య సాధనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్, కార్పొరేషన్ అధికారులు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, మహిళ నాయకులు, సమాఖ్య అధ్యక్షులు, రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

చింతలపూడి, మార్చి 7: రాఘవాపురం హైస్కూలులో 9, 10 తరగతుల విద్యార్థులు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెళ్ళిన రాఘవాపురం సొసైటీ అధ్యక్షులు గిరి భోగారావు పదో తరగతి విద్యార్థులు 100 మందికి ప్యాడ్‌లు, పెన్నులు, స్కేళ్ళను పంపిణీ చేశారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తేవాలని సూచించారు.

ధర్మాజీగూడెం పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శనలు

లింగపాలెం, మార్చి 7: ధర్మాజీగూడెం ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తాము తయారు చేసిన పరికరాలను ప్రదర్శిం చారు. వాటిని తయారు చేసిన విధానాన్ని వివరించారు. వివిధ రకాల ఆకృతులతో తయారు చేసిన పరికరాలు ప్రదర్శనలో ఉంచడంతో పలువురు వాటిని చూసి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎంఈవో కె.రామారావు, పాఠశాల హెచ్ఎం సీహెచ్.రత్నాకర్, కరస్పాండెంట్ సాయిసునంద, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీల సమ్మేళనం

లింగపాలెం, మార్చి 7: రంగాపురంలో మాల మహాసేన జాతీయ ప్రధాన కార్యదర్శి సరిపల్లి పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సమ్మేళనం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాలమహాసేన జాతీయ అధ్యక్షుడు అలగా రవికుమార్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీఎస్టీబీసీ, మైనార్టీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని కోరారు. వారందరూ కలిసి ఉండాలని అన్నారు. ప్రతిఒక్కరూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఐఖ్యమత్యంతో అవి సాధించవచ్చని అన్నారు. అట్టడుగు స్థాయి ప్రజలను అభివృద్ధి చేయాలంటే వీరి పై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ, సామాజిక నాయకులు పాల్గొన్నారు.



శోభనాపురంలో శివలింగం, పెదగొన్నూరులో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, చాట్రాయి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో విద్యుత్‌కాంతులు, కలిదిండిలో భోగేశ్వరస్వామి ఆలయం

శంభో శంకరా..

» నేడు మహాశివరాత్రి పర్వదినం » శివాలయాలు ముస్తాబు

జిల్లాలోని పలు మండలాల్లో వున్న శివాలయాలు శుక్రవారం మహాశివరాత్రి పురస్కరించుకుని ముస్తాబయ్యాయి. ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, బారికేడ్లను నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆగిరిపల్లి, మార్చి 7: ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి బస్టాండు సెంటర్‌లో వున్న గంగాఅన్నపూర్ణసమేత విశ్వేశ్వర ఆలయం, మెట్లకోనేరు వద్ద గల బాలాత్రిపురసుందరీసమేత ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం మహన్యాస రుద్రాభిషేకాలు, సాయంత్రం గ్రామోత్సవం, శివపార్వతుల కల్యాణం నిర్వహిం చామని అర్చకులు తెలిపారు. శోభనాపురం గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, సాయంత్రం ఆరు గంటలకు వెయ్యిమంది మహిళలు జ్యోతులతో స్వామివారి ఊరేగింపు, హోమగుండం, కోటిదీపోత్సవం, శాంతికల్యాణం, అభిషేకాలు నిర్వహించామని పూజారి శర్మస్వామి తెలిపారు.

ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానంలో..

చాట్రాయి, మార్చి 7: చాట్రాయి ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానం, తుమ్మగూడెం, జనార్దనవరం, సిగుడిపాడు శివాలయాలు విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీలు భక్తుల పుణ్యస్నానాలు, స్వామివారి దర్శనం, తాగు నీరు, మజ్జిగ పంపిణీ, అన్నసమారాధన, శిపార్వతుల కల్యాణం నిర్వహించారు.

పెదగొన్నూరు మల్లేశ్వరస్వామి ఆలయంలో..

ముదినేపల్లి, మార్చి 7 : పెదగొన్నూరు భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసి అర్చకులు లంకా వెంకటేశ్వరబాబు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈవో ఎస్‌.కె.కిషోర్‌ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా బలిహరణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి.

పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

కలిదిండి, మార్చి 7 : కలిదిండిలోని పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. ఆలయ చైర్మన్‌ అడివి వెంకట గంగాధరశర్మ, అలివేలు దంపతులచే గురువారం రాత్రి స్వామివారి దివ్య కల్యాణం నిర్వహించామని ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

అన్నవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో..

నూజివీడు టౌన్‌, ఏప్రిల్‌ 7:అన్నవరం గ్రామంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని సర్వసూక్త సహిత అభిషేక, శివసహస్ర నామార్చన, సుబ్రహ్మణ్య సహస్ర నామార్చన, నాగదేవతా అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ పూజారి బి.పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు శివపంచాక్షరి ఏకనామజప భజన, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బలివేలో పూజలు



గ్రామదేవత గంగానమ్మకు పూజలు

మునునూరు, మార్చి 7: బలివే శ్రీరామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గ్రామదేవత గంగానమ్మకు 101 బిందెలతో జలాభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు తోలేటి అరుణభాస్కరరావు వేదమంత్రోచ్చరణలతో స్వామివారి ధ్వజారోహణ పూజాకార్యక్రమాన్ని నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం బిందె తీర్థం, స్వామికి అభిషేకం, ప్రసాద స్వీకరణ చేశారు. సాయంత్రం గణపతి శాంతి హోమం, బలిహరణాదులు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామికి విశేష అభిషేకం నిర్వహిం చిన అనంతరం రెండు గంటల నుంచి స్వామివారి సర్వదర్శనం ఉంటుందని, శివలింగం వద్ద మధ్యాహ్నం ఒంటి గంటవరకు అభిషేకాలు జరుగుతాయని ఈవో నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మహారుద్రాభి షేకం, హోమము, బలిహరణ జరుగుతాయని, సాయంత్రం జగజ్యోతి కార్యక్రమం, రాత్రి 11 గంటలకు స్వామివారి కల్యాణం, అనంతరం తాతగుడి వద్దకు గ్రామోత్సవంగా వెళ్లి ఆశీస్సులు తీసుకునే కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తెలిపారు.

350మందితో పటిష్ఠ పోలీస్‌ బందోబస్తు

బలివే ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 350మందితో పోలీస్‌లతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య తెలిపారు. ఒక డీఎస్పీ, ముగ్గురు సీఐలు, పదిమంది ఎస్‌ఐలతోపాటు ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్‌లు 64మంది, మహిళా కానిస్టేబుల్‌లు 30మంది, కానిస్టేబుల్‌లు 242మందితో మూడు మూడు షిప్టలతో బందోబస్తు ఉంటుందన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో, ఆలయం లోపల సూమారు 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రతి క్షణం సీసీపుటేజీని పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

బలివే శివరాత్రి ఉత్సవాలకు సిద్ధం

» 350మంది పోలీసులతో బందోబస్తు
» స్వామివారి సర్వదర్శనానికి ప్రత్యేక చర్యలు



బలివే ఆలయంలో విద్యుత్‌కాంతులు

మునునూరు, మార్చి 7: బలివే శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఐదు రోజులపాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామని ఆలయ ఈవో నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు సూమారు రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉందన్నారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేశామని, సర్వ దర్శనానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, రూ 25, రూ100, రూ 200 టికెట్‌లతో ప్రత్యేక దర్శనం ఉందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్‌ ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు మంచినీరుతోపాటు మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు అందిస్తామన్నారు. భక్తుల పుణ్యస్నానాలకు ఇప్పటికే స్వామివారి ఆలయం చెంతకు తమ్మిలేరు జలాలు వచ్చాయని, పంచాయితీ ఆధ్వర్యంలో ఐదు మోటార్లతో జల్లుల స్నానాలకు ఏర్పాట్లు చేశామన్నారు. స్వామివారి లడ్డూ ప్రసాదం 30వేలు సిద్ధం చేశామని, ఏలూరు సత్యసాయి సేవసంస్థ, తపన ఫౌండేషన్‌తోపాటు మరికొన్ని సేవాసంస్థలు ఉత్సవాలకు వచ్చే భక్తులకు పలు రకాల ప్రసాదాల వితరణ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని ఈవో తెలిపారు. ఆర్టీసీ 50 ప్రత్యేక బస్సులను ఏలూరు, చింతలపూడి, సత్తుపల్లి, నూజివీ డు నుంచి నడుపుతుందన్నారు. ముఖ్యంగా వీఐపీ పాస్‌లను పూర్తిగా రద్దు చేశామన్నారు. ఉత్సవాల్లో భక్తులు భక్తిభావంతో స్వామి వారిని దర్శించుకునేలా పలు శాఖల అధికారుల సమన్వయంతో సకల ఏర్పాట్లు చేశామని ఈవో తెలిపారు.

సూపర్‌సిక్స్‌ పథకాలను వివరించాలి

» టీడీపీ, జనసేన నూజివీడు ఉమ్మడి అభ్యర్థి పార్థసారథి



సారథితో సమావేశమైన చాట్రాయి నాయకులు

చాట్రాయి, మార్చి 7: సూపర్‌సిక్స్‌ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని నూజివీడు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి చాట్రాయి మండల నాయకులను కోరారు. గురువారం నూజివీడులో పార్టీ మండల అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు, విజయ డెయిరీ డైరెక్టర్‌ బొట్టు రామచంద్రరావు, తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చీకటి చెన్నారావు తదితరులు ఆయనను కలిసి మండలంలో రాజకీయ పరిస్థితిపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మంచి మెజారిటీ తథ్యమని నాయకులు పార్థసారథికి వివరించారు.

చీకటి జీవోలపై వున్న శ్రద్ధ పేదలపై ఏది ?

నూజివీడు, మార్చి 7: చీకటి జీవోలను అమలు చేయడంలో రాష్ట్రప్రభుత్వానికి వున్న శ్రద్ధ పేదల అభివృద్ధికి ఇస్తున్న జీవోలను అమలు చేయడంలో లేదని నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. అన్నవరంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్సీ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ దువ్వూరి వెంకయ్య తెలిపారు. స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. చర్చి ప్రహరీ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్థులతో ఆత్మీయ సమావేశానికి పాదయాత్రగా వెళ్లడంతో గ్రామస్థులు స్వాగతం పలికారు. నూజివీడు మండల టీడీపీ అధ్యక్షుడు ముసునూరు రాజా, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్‌, అన్నవరం మాజీ సర్పంచ్‌ వీరమాచినేని సత్యనారాయణ, ఉపసర్పంచ్‌ చలసాని గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు యాదాల సత్యనారాయణ, చలసాని సూర్యనారాయణతో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటినుంచి టీడీపీ ధర్మ పోరాట యాత్ర



కొడాలి వినోద్‌

ముదినేపల్లి, మార్చి 7 : తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ పోల్‌ మేనేజ్‌మెంట్‌ ఇన్‌చార్జి కొడాలి వినోద్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలో ధర్మపోరాట పాదయాత్ర ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు ఈ యాత్రను పలు గ్రామాల్లో నిర్వహిస్తారు. ఉదయం ముదినేపల్లిలోని ఎన్టీఆర్‌ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా కానుకొల్లు చేరి అక్కడ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్‌కట్‌ చేసి పాదయాత్ర ప్రారంభిస్తారు. తెలుగుదేశం-జనసేన విడుదల చేసిన సూపర్‌ సిక్స్‌ పథకాలతోపాటు బీసీ డిక్లరేషన్‌, క్రైస్తవుల సంక్షేమానికి అమలు చేసేందుకు రూపొందించిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేసేందుకు ధర్మపో రాట యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం పుట్లచెరువు, పసలపూడి, రెండో రోజు, మూడో రోజు పెనుమాకలంక, మణుగునూరులంక, కొవ్వాడలంక, చింతపాడు, మూడు తాళ్లపాడు, భైరవపట్నం, మండవల్లి, పెరికిగూడెం, లింగాల గ్రామాల్లో నిర్వహిస్తారు. ఈ పాదయాత్రలో నియోజక వర్గ, మండల స్థాయి క్లస్టర్‌, బూత్‌స్థాయి పార్టీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొంటారు.

ఉపాధి పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



లోపూడిలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్‌ భానుశ్రీ

ముసునూరు, మార్చి 7: ఉపాధి హామీ పథకంలో రైతుల ఆర్థికాభివృద్ధికి ఉపయుక్తంగా ఉండే అనేక పథకాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ జిల్లా కలెక్టర్‌ జి. భానుశ్రీ అన్నారు. గుళ్లపూడిలో ఉపాధిహామీ ద్వారా రైతు ఎం.సత్యనారాయణ సాగుచేసిన తైవాన్‌జామ పంటను ఆమె గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, లాభనష్టాలపై రైతుతో మాట్లాడారు. రైతులకు పండ్లతోటల పెంపకంపై అవగాహన కల్పించి, సాగు విస్తీర్ణత పెంచాలని ఉపాధి సిబ్బందికి ఆమె సూచించారు. లోపూడిలో జరిగే ఉపాధిపనులను ఆమె పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీసి సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కార్యాక్రమంలో సర్పంచ్‌ పేరం కృష్ణ, ఏపీవో రోజ్‌లీల, ఈసీ జయప్రసాద్‌, టీఏలు రవి, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో యువతకు ఉపాధి కరువు

చాట్రాయి, మార్చి 7: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల పేద కుటుంబాల్లోని యువతకు ఉపాధి కరువైందని సీపీఐ(ఎంఎల్‌)లిబరేషన్‌ జిల్లా కమిటీ సభ్యుడు చాట్ల బాబూరావు, గ్రామ కమిటీ అధ్యక్షురాలు చిలకమ్మ విమర్శించారు. చిత్తపూరులో గురువారం లిబరేషన్‌ నాయకులు, పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేశారని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలకు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, పెన్షన్లు రూ.5 వేలకు పెంచాలని, స్కీం వర్కర్లకు రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. జిల్లా నాయకుడు వేముల బక్కయ్య, నాగేశ్వరమ్మ, లూసిమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సెక్టార్‌ ఆఫీసర్ల నియామకం

ముదినేపల్లి, మార్చి 7 : సాధారణ ఎన్నికల ఏర్పాట్లు పర్యవేక్షణ, నిర్వహణకు ముదినేపల్లి మండలాన్ని ఆరు సెక్టార్లుగా ఏర్పాటు చేశారు. మండలంలోని 61 పోలింగ్‌ స్టేషన్లకు సంబంధించి సెక్టార్‌ ఆఫీసర్లు ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదలైన నాటి నుంచి విధులను నిర్వహిస్తారు. మండలంలోని పోలింగ్‌ స్టేషన్ల పర్యవేక్షణకు ఈవోపీఆర్‌డీ డి.లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి కె.వేణుమాధవ్‌, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సతీష్‌, ఇరిగేషన్‌ ఏఈఈ కిషోర్‌, పీఆర్‌ ఏఈ కోమల్‌రాజ్‌, హౌసింగ్‌ ఏఈ శేషగిరిరావులను జిల్లా ఎన్నికల అధికారి నియమించారు. సెక్టార్‌ ఆఫీసర్లతోపాటు మరో ఇద్దరు సిబ్బంది ఉంటారు. వీరు మండలంలోని పోలింగ్‌ స్టేషన్లను పరిశీలించి ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. పోలింగ్‌ బూత్‌ల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటారు.

12న దళిత సమ్మేళనం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ దళిత నాయకులు

కలిదిండి, మార్చి 7 : టీడీపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ఈనెల 12న కలిదిండిలో నిర్వహించే దళిత సమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేయాలని టీడీపీ మండల ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు బళ్ల రాజు తెలిపారు. గురువారం కలిదిండిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో 27 ఎస్సీ సంక్షేమ పథకాలను రద్దు చేశారని, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయన్నారు. టీడీపీతోనే దళితులకు ఆత్మగౌరవం దక్కుతుందన్నారు. దళితులు పెద్దసంఖ్యలో విచ్చేసి దళిత సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ దళిత నాయకులు జక్కుల పౌలురాజు, జాన్‌ రాజు, నున్న సుధాకర్‌, సిలి రవి, భూపతి ప్రకాష్‌, ఈదా దుర్గారావు, లేళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం జాతీయ కార్యదర్శికి సత్కారం



నరసింహారావును సత్కరిస్తున్న ఆర్టీఏ ప్రతినిధుల

ముదినేపల్లి, మార్చి 7 : సమాచార హక్కు చట్టం జాతీయ కార్యదర్శి ముదినే పల్లి మండలానికి చెందిన బీబీవీ నరసింహారావును ఆర్టీఏ జాతీయ ప్రతినిధులు, మానవ హక్కుల సంఘం ప్రతినిదులు సంయుక్తంగా సన్మానిం చారు. గురువారం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జాతీయ సమాచార హక్కు చట్టం సమ్మిట్ మానవహక్కుల అవగాహన సదస్సులో ఆయనను ఆర్టీఏ జాతీయ ఉపాధ్యక్షుడు మట్టా ప్రసాద్‌, మహిళా అధ్యక్షురాలు చంద్రకళారెడ్డి, ఇతర అధికారులు సత్కరించారు. సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నరసింహారావు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయన్ని సన్మానించారు.



కైకలూరులో మాట్లాడుతున్న వీవీఎస్‌వీ లక్ష్మి, ముదినేపల్లి తహసీల్దార్‌ను సత్కరిస్తున్న యూటీఎఫ్‌ నాయకులు, వట్టిగుడిపాడులో మహిళలకు సత్కారం

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

» కైకలూరు సీనియర్‌ న్యాయసేవాధికారిణి లక్ష్మి
» ఘనంగా మహిళా దినోత్సవం.. పలువురికి సన్మానం

కైకలూరు, మార్చి 7:మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తే సమాజ అభివృద్ధి సాధ్యపడుతుందని కైకలూరు సీనియర్‌ న్యాయసేవాధికారిణి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకలూరు ఐకేబీ భవనంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఒకటేనని వారి మధ్య వ్యత్యాసాలు చూపడం చట్టరీత్యా నేరమన్నారు. శివరాత్రి పండుగ పురస్కరించుకుని ఒకరోజు ముందుగానే మహిళా దినోత్సవం జరుపుతున్నట్టు అంగన్‌వాడీ టీచర్లకు, డ్వాక్రా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మాడెం వీరవెంకట సత్యనారాయణ, సెక్రటరీ బి.లక్ష్మణరావు, జాయింట్‌ సెక్రటరీ, చావలి శంకరశాస్త్రి, ఏపీఎం బి.సత్యనారాయణ, ఇన్‌చార్జి సీడీపీవో లావణ్య, తదితరులు పాల్గొన్నారు. కైకలూరు టౌన్‌ పోలీసుస్టేషన్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా పోలీసుసిబ్బందికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను సీఐ ఆకుల రఘు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులను ఘనంగా సత్కరించారు. ఏఎస్‌ఐ మల్లికార్జునరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● ముసునూరు : మహిళలు అన్ని రంగాల్లో నైపుణ్యత సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐసీడీయస్‌ అసిస్టెంట్‌ సీడీపీవో నాగేశ్వరి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌ కొండేటి విజయలక్ష్మి మాట్లాడుతూ దేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, కేంద్ర ఫైనాన్స్‌ మినిస్టర్‌ నిర్మలా సీతారామన్‌, వంటి మహిళాలు ఉన్నతస్థానాలను సాధించారని, వీరి ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం ఎంపీపీ కొండా దుర్గాభవాని మాట్లాడారు. పలు పోటీల్లో విజేలుగా నిలిచిన మహిళలకు ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, కె.ధనలక్ష్మి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి, మార్చి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముదినేపల్లి తహసీల్దార్‌ ఎస్‌.లక్ష్మీ నరస కుమారిని యునైటెడ్‌ టీచర్స్‌ ఫెడరేషన్‌ మండల శాఖ ఘనంగా సత్కరించింది. గురువారం యూటీఎఫ్‌ మండల శాఖ అధ్యక్షురాలు శాయి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఐ.దుర్గా ప్రసాద్‌ తదితరులు తహసీల్దార్‌ కార్యాలయంలో ఆమెను సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పలు అవార్డులు సాధించిన ఆమెను యూటీఎఫ్‌ నాయకులు అభినందించారు.

● ఆగిరిపల్లి, మార్చి 7: వట్టిగుడిపాడు మండల పరిషత్‌ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామసర్పంచ్‌ శ్రీమతి కిరణ్మయ్‌ప్రకాష్‌ మాట్లాడుతూ స్త్రీలు అభివృద్ధి పథంలో పయనించాలని, ప్రతిరంగంలో ముందంజ వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యాశాఖ అధికారులు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్‌ మాట్లాడుతూ స్త్రీగొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకులు చౌటపల్లి సురేష్‌ మాట్లాడుతూ మహిళలు రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుని విద్యారంగంలో ఎదగాలని సూచించారు. అనంతరం గ్రామసర్పంచ్‌ పాఠశాలలో పనిచేసే మహిళా ఉద్యోగినిలను వంట ఏజెన్సీ వారిని పారిశుధ్య కార్మికురాలిని సత్కరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎ ఇందిర, అంకం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

● ముదినేపల్లి రూరల్‌, మార్చి 7: శ్రీహరిపురం గ్రామంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు విభిన్నరంగాల్లో సాధించిన ప్రగతిని సమావేశంలో వక్తలు ప్రశంసించారు. సమాజంలో మహిళపాత్ర ఎంతో ప్రాముఖ్యత ఉందని మహిళ లేనిదే సమాజం లేదని వక్తలు అభివర్ణించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌ పరసా విశ్వేశ్వరరావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

● మండవల్లి, మార్చి 7: మండవల్లిలోని కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పలు సొసైటీల మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మండవల్లి బ్రాంచి మేనేజర్‌ రాజులపాటి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మండవల్లి బ్రాంచి సూపర్‌వైజర్‌ ఉండవల్లి సాయికృష్ణ, సిబ్బంది, వినియోగదారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చాలి



మాట్లాడుతున్న జడ్జి నాగశైలజ

నూజివీడు టౌన్‌, ఏప్రిల్‌ 7:బాధ్యతలను సమర్థవంతంగా నెరవేరుస్తున్న వారికి సమాజంలో ఎప్పటికీ గౌరవం ఉంటుందని 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్‌ ఎ.నాగశైలజ అన్నారు. నూజివీడు సారథి ఇంజనీరింగ్‌ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సమాజాభివృద్ధికి తోడ్పడే విధంగా తల్లిదండ్రులు వారి పిల్లలకు కుటుంబ విలువలు, బంధాలను వివరించి చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. తద్వారా వైవాహిక జీవితంలో వారికి బంగారు భవిష్యత్‌ ఉంటుందన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్‌పై దృష్టిపెట్టి చదువు, ఉద్యోగ, ఉపాధిరంగాల్లో రాణించాలని సూచించారు. నూజివీడు డీఎస్పీ జి.లక్ష్మయ్య, సారథి ఇంజనీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీధర్‌, ఏవో రామచంద్రరావు, అడ్వకేట్‌ ఎ.రమాకుమారి పాల్గొన్నారు.

ప్రతిపక్ష కౌన్సిలర్లకు గౌరవమేదీ ?

» నూజివీడు మునిసిపల్‌ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల ఆగ్రహం



టెండర్లపై మాట్లాడుతున్న ఫ్లోర్‌లీడర్‌ దుర్గాప్రసాద్‌, చైర్‌పర్సన్‌ త్రివేణిదుర్గ

నూజివీడు టౌన్‌, ఏప్రిల్‌ 7:ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రతిపక్ష కౌన్సిలర్లకు కనీసగౌరవం ఇవ్వకుండా నూజివీడు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ఎంపిక శాసనసభ్యులే చేశారని చెప్పడం దారుణమని పేర్కొంటూ నూజివీడు టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నూజివీడు మున్సిపల్‌ సమావేశ మందిరంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన మున్సిపల్‌ అత్యవసర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నూజివీడు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి నూజివీడు పట్టణాభివృద్ధికి రూ.16కోట్లు మంజూరు చేయగా, సదరు పనులకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్‌ త్వరలో రానుండడంతో టెండర్ల ఆమోద ప్రక్రియకు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూజివీడు మున్సిపల్‌ ఫ్లోర్‌లీడర్‌ చెరుకూరి దుర్గాప్రసాద్‌ మాట్లాడుతూ ప్రతి వార్డుకు రూ.50లక్షల నిధులు మంజూరు కాగా సదరు అభివృద్ధి పనులకు సింగిల్‌ టెండర్లను ఏ విధంగా పిలుస్తారంటూ ఆయన ప్రశ్నించారు. ఎస్టిమేషన్లు వేసి దాదాపు మూడునెలలు గడుస్తుండగా ఎన్నికల నోటిఫికేషన్‌ నేపథ్యంలో పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి నిధుల పేరుతో మభ్యపెట్టేందుకే హడావుడిగా టెండర్ల ప్రక్రియ పూర్తిచేయడం తగదన్నారు. నూజివీడు పట్టణంలో పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సమావేశంలోనూ పారిశుధ్య పనులకు అద్దెప్రాతిపదికన ట్రాక్టర్లు తీసుకుంటున్నామంటూ టేబుల్‌ అజెండా పెట్టడం తగదని పారిశుధ్య నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నూజివీడు మునిసిపల్‌ కో-ఆప్షన్‌ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటరామిరెడ్డి, డీఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శోభనాచలుని హుండీ ఆదాయం రూ.2.02 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ఆగిరిపల్లి, మార్చి 7: శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామివార్ల దేవస్థాన హుండీ ఆదాయం రూ.2 లక్షల 2వేల 24 రూపాయలు వచ్చిందని అధికారులు తెలిపారు. గురువారం ఆలయానికి చెందిన ఆరు నెలల హుండీలను లెక్కించారు. లెక్కింపు కార్యక్రమంలో గన్నవరం డివిజన్‌ ఇన్‌స్పెక్టర్‌ వి.సుధాకర్‌, కార్యనిర్వహణ అధికారి ఎన్‌.భవాని, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్‌ పరీక్షలకు 14 మంది విద్యార్థుల గైర్హాజరు

ముదినేపల్లి, మార్చి 7 :ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల పరీక్షల కేంద్రంలో గురువారం జరిగిన ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. లెక్కలు -2ఏ, బోటనీ-2, సివిక్స్‌ -2 సబ్జెక్టులకు జరిగిన పరీక్షలు 234 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా, 220 మంది హాజరయ్యారని చీఫ్‌ సూపరింటెండెంట్‌ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. పరీక్షలను డిపార్ట్‌మెంటల్‌ అధికారి కె.వి.వి.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ప్రజల ఆస్తులు తాకట్టు పెట్టే కుట్ర

» జగన్‌ ప్రభుత్వంపై కామినేని విమర్శ



అప్పాపురంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని

మండవల్లి, మార్చి 7: సచివాలయాలను సైతం జగన్‌ ప్రభుత్వం తాకట్టు పెట్టిందని భవిష్యత్తులో ప్రజల ఆస్తులను కూడా దొడ్డిదారిన తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి డాక్టర్‌ కామినేని శ్రీనివాస్‌ విమర్శించారు. మండవల్లి మండలం అప్పాపురం, అల్లినగరం, కానుకొల్లు గ్రామాల్లో గురువారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన ప్రజల సమస్యలపై చర్చించారు. ప్రజలు సంపాదించుకున్న ఆస్తులు సైతం జగన్‌ దోచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు చైతన్యవంతంగా వ్యవహరించకపోతే కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు సైతం జగన్‌ దోచేస్తారని తస్మాత్‌ జాగ్రత్త అంటూ కామినేని ప్రజలకు వివరించారు. కైకలూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఆగడాలు పెరిగాయని, ప్రజలు గమనిస్తున్నారని వైసీపీ నాయకులకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బీకేఎం కన్‌స్ట్రక్షన్‌ అధినేత బొమ్మనబోయిన వరప్రసాద్‌, మండవల్లి మండలం టీడీపీ అధ్యక్షుడు నారగాని వీరవెంకట నాగేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు రైతు నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు పూల రామచంద్రరావు, కైకలూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్‌, బొల్లంపల్లి కృష్ణారావు, చాబత్తిన విజయ్‌, గంగుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అధికారులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న శ్రీనివాసరావు

నూజివీడు, మార్చి 7: ఎన్నికల నోటిఫికేషన్‌ ప్రారంభమైన నాటి నుంచి ఎన్నికలు ముగిసేవరకు మోడల్‌కోడ్‌ ఆఫ్‌ కాంటాక్ట్‌ ఉంటుందని ఈ సమయంలో ప్రతి అంశం ఎన్నికల కమిషన్‌ పరిధిలో నిఘాలో ఉంటుందని మాస్టర్‌ ట్రైనీ డి. శ్రీనివాసరావు తెలిపారు. నూజివీడు ఆర్డీవో భవానీశంకరి నేతృత్వంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌ టీమ్‌, వీడియో యువర్స్‌టీమ్‌, ఎస్‌.ఎస్‌.టి టీమ్‌ తదితర విభాగాలకు వారి విధులు, తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో మాస్టర్‌ ట్రైనీతో పాటు మరో ఎనిమిది మంది మాస్టర్‌ ట్రైనీలు పాల్గొన్నారు.

ఔషద మొక్కల తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త అపర్ణ

నూజివీడు టౌన్‌, మార్చి 7: డాక్టర్‌ వైఎస్సార్‌ ఉద్యాన విశ్వవిద్యాలయం రామన్నగూడెం ఆధ్వర్యంలో హనుమంతులగూడెం గ్రామానికి చెందిన రైతులకు ఔషధ, సుగంధ మొక్కల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్సీ రైతులను ఎంచుకుని ఎస్సీ, ఎస్టీ పథకంలో భాగంగా అశ్వగంథ సాగులో మెలకువలను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవిశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్‌ డి.అపర్ణ, పి.సునీత తదితరులు రైతులకు శిక్షణ ఇవ్వగా, కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ టీఏ ప్రసాద్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు టీడీపీ నాయకులకు నివాళులు

ఆగిరిపల్లి, మార్చి 7: నెక్కలంగొల్లగూడెంలోని టీడీపీ నాయకుడు మాదు తిరుపతిరావు(49) గురువారం మరణించారు. ఈ విషయం తెలిసి నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం చేసి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్‌ కార్యదర్శి నల్లమోతు రమేష్‌, ఖాజా కుటుంబరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. సూరవరం గ్రామంలో మరో టీడీపీ సీనియర్‌ నాయకులు బొడ్డు చంద్రబోస్‌ మరణించడంతో భౌతిక కాయానికి నివాళులర్పించి, ఆ కుటుంబాన్ని కూడా పార్థసారథి పరామర్శించారు.

వార్డు సభ్యుడిపై అట్రాసిటీ కేసు

కైకలూరు, మార్చి 7: పారిశుధ్య కార్మికురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వార్డు సభ్యుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని కైకలూరు టౌన్‌ సీఐ ఆకుల రఘు గురువారం తెలిపారు. కైకలూరు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలి పట్ల వార్డు సభ్యుడిగా పనిచేస్తున్న ఎం. నాంచారయ్య అసభ్యంగా మాట్లాడుతూ కొంతకాలంగా వేధింపులకు గురిచేశాడని ఆయనపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.